

11 మంది 'ఉక్కు' కార్మిక సంఘ నాయకులకు షోకాజ్ నోటీసులు

- వీరిలో నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్?
- నేడు స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం కూడలి వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా



-7లో

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ షురూ

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 3,158

33 యూపీ పాఠశాలలు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్

- మోడల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా స్కూలు అసిస్టెంట్
- మొత్తం 538 పోస్టులు సర్దుబాటు

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ హయాంలో వెలువడిన జీవో 117ను రద్దు చేస్తూ...పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీని ప్రకారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అన్ని రకాల పాఠశాలలు కలిపి 3,158 ఉంటాయి. ఇందులో 228 ఫౌండేషన్ పాఠశాలలు, 1,921 బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 563 మోడల్ ప్రాథమిక పాఠశాలలు, 89 యూపీ పాఠశాలలు, 237 ఉన్నత పాఠశాలలు, 88 ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 32 ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉంటాయి. పిల్లల సంఖ్య ఎక్కువ కలిగిన, ఉన్నత పాఠశాలలు ఐదు కిలోమీటర్లకు మించి దూరంలో ఉన్న ప్రాంతాల్లో గల 33 యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, కొత్తగా ఏర్పాటుచేసే మోడల్ ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించనున్నది. అయితే ఇప్పటికే ఎక్కువమంది విద్యార్థులు గల ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు (స్కూల్ అసిస్టెంట్ కేడర్) ఉన్నచోట వారినే కొనసాగించనున్నది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 563 మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో 286 పాఠశాలలకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు పనిచేస్తున్నారు. మిగిలిన 277 మోడల్ ప్రాథమిక పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్లను హెచ్‌ఎంలుగా నియమిస్తారు. ఇందులో 252 మంది మండల/జడ్పీ పాఠశాలలు, 16 మంది ప్రభుత్వ పాఠశాలలు, తొమ్మిది మంది జీవీఎంసీలో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్లు ఉన్నారు.

తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు ఉమ్మడి జిల్లాలో 538 హెచ్‌ఎంలు/స్కూలు అసిస్టెంట్లు/ఎస్జీటీ పోస్టులను ఒక పాఠశాల నుంచి మరోచోటకు సర్దుబాటు చేశారు. అందులో 277 మంది స్కూలు అసిస్టెంట్లను మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమిస్తారు. మరో 28 స్కూలు అసిస్టెంట్లు, మూడు ఎస్జీటీ పోస్టులను అవసరం ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఇంకా 23 హెచ్‌ఎం, 103 స్కూల్ అసిస్టెంట్, 104 ఎస్జీటీ పోస్టులు...మొత్తం 230 పోస్టులను ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు సర్దుబాటు చేశారు. ఈ నేపథ్యంలో పిల్లలు తక్కువ గల ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులు రద్దు చేసి కొత్తగా అప్‌గ్రేడ్ చేసిన ఉన్నత పాఠశాలలకు కేటాయించారు. కొన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు మించి ఒక సబ్జెక్టులో ఎక్కువ మంది స్కూలు అసిస్టెంట్ పోస్టులు ఉంటే కొన్నింటిని అక్కడే కొనసాగించి మిగిలిన పోస్టులను అవసరం ఉన్న పాఠశాలలకు ... మిగతా 6వ పేజీలో



ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసిన డాబాగార్డెన్స్‌లోని ఆర్‌బీఎం యూపీ పాఠశాల



ముస్లింతాటిచెట్లపాలెంలో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసిన ఉర్దూ యూపీ పాఠశాల

కొత్తగా అమలులోకి వచ్చిన విధానం ప్రకారం...అనకాపల్లి జిల్లాలో 1,396, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,200, విశాఖపట్నం జిల్లాలో 562 పాఠశాలలు ఉంటాయి.

జిల్లా	ఫౌండేషన్	బేసిక్ ప్రాథమిక	మోడల్ ప్రాథమిక	యూపీ	ఉన్నత	ఉన్నత ప్లస్ బేసిక్	ఉన్నత ప్లస్ మోడల్
అల్లూరి జిల్లా	36	925	199	13	16	4	9
అనకాపల్లి	151	764	187	55	145	78	18
విశాఖపట్నం	41	232	178	21	76	10	5
మొత్తం	228	1,921	563	89	237	88	32

బీచ్‌రోడ్డులో ఖాకీల దందా

మందుబాబులు, ప్రేమ జంటలే టార్గెట్

- మద్యం సేవించి వెళుతున్న వారిని ఆపి తనిఖీల పేరుతో హడావిడి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రుషికొండ ఐటీ సెజ్ సమీపంలో బీచ్‌లో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్న ఒక జంట వద్దకు బీచ్ పెట్రోలింగ్ సిబ్బంది వెళ్లారు. స్టేషన్‌కు రావాలని ఆదేశించారు. తల్లిదండ్రులను కూడా స్టేషన్‌కు పిలిపిస్తామంటూ ఫోన్ నంబర్ అడిగారు. దాంతో బెదిరిపోయిన ఆ జంట... తమను వదిలేయాలని వేడుకోవడంతో సమీపంలోని ఒక మద్యం దుకాణం వద్దకు తీసుకువెళ్లి రూ.ఐదు వేలు ఫోన్ పే చేసి వెళ్లాలని ఆదేశించారు.

- కేసు వద్దని వేడుకుంటే దూరంగా ఉండే దుకాణానికి వెళ్లి డబ్బులు ఇచ్చేయాలని సూచన
- తల్లిదండ్రుల ఫోన్ నంబర్ ఇవ్వాలంటూ ప్రేమ జంటలకు బెదిరింపు
- ఇంట్లో తెలిస్తే ఇబ్బంది అవుతుందని వేడుకుంటే దుకాణంలో డబ్బులు ఇచ్చి వెళ్లాలని ఆదేశం



రుషికొండలోని ఒక దుకాణంలో మద్యం సేవించిన వ్యక్తిని దూరంగా ఉండి గమనించిన కానిస్టేబుల్ ఒకరు అనుసరించి, రుషివ్యాలీ సెంటర్ వద్ద ఆపి, బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేస్తానని బెదిరించారు. మద్యం సేవించి ఉన్నానని, కేసులు వంటి తలనొప్పి వద్దని వేడుకోవడంతో సమీపంలోని ఒక పాన్‌షాప్‌లో రూ.రెండు వేలు ఇచ్చి వెళ్లిపోవాలని ఆదేశించారు.

నగరంలో కొంతమంది పోలీసులు బరితెగించి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు స్టేషన్‌లోనే దుకాణం తెరిస్తే, మరికొందరు స్టేషన్ పరిధిలో వివిధ వ్యాపారాలు చేసేవారి నుంచి మామూళ్లు గుంజుతున్నారు. ఇక జోడుగుళ్లపాలెం జంక్షన్ నుంచి భీమిలి వరకూ బీచ్ పెట్రోలింగ్, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రక్షక్ విధులు నిర్వర్తించే వారిలో కొందరు బీచ్‌రోడ్డులో మందుబాబులు, ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుంటున్నారు.

మద్యం దుకాణాలకు దూరంగా ఉండి ...అక్కడకు వెళ్లి తిరిగి వస్తున్న వారిపై నిఘా పెడుతున్నారు. మద్యం సేవించిన వ్యక్తి వాహనం స్టార్ట్ చేసి కొంచెం ముందుకువెళ్లగానే ఆపుతున్నారు. బ్రీత్ అనలైజర్లను నోటి వద్ద పెట్టి ఊదాల్సిందిగా కోరుతున్నారు. మద్యం సేవించిన వ్యక్తి భయంతో కేసు లేకుండా చూడాలని వేడుకోగానే...దానికోసమే ఎదురుచూస్తున్న సిబ్బంది డబ్బుల కోసం డిమాండ్ చేస్తున్నారు. నేరుగా డబ్బులు తీసు కుంటే ఇబ్బంది కాబట్టి, సమీపంలోని మద్యం దుకాణానికి లేదంటే పాన్ షాపుల వద్దకు వెళ్లి డబ్బులు ఇచ్చేయాలని సూచిస్తున్నారు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తి పోలీస్ సిబ్బంది సూచించిన చోటకు వెళ్లి నగదు అందజేయడం, లేదా ఫోన్‌పే చేయడం చేస్తున్నారు. వారం రోజుల కిందట రిషి వ్యాలీ సెంటర్‌లో ఒక రుమద్యం సేవించి పోలీసులకు పట్టుబడగా, కేసు లేకుండా చూడాలని బాధితుడు వేడుకున్నాడు. దీంతో అతన్ని సమీపంలోని ఒక పాన్‌షాప్ వద్దకు పంపించి రూ.రెండు వేలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ విషయం పీఎం పాలెం స్టేషన్ అధికారుల దృష్టికి చేరడంతో విచారణ ప్రారంభించినట్టు సమాచారం.

అలాగే రుషికొండ నుంచి తిమ్మాపురం వరకూ జంటలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఆ ప్రాంతంలో విధులు నిర్వర్తించే వివిధ విభాగాల పోలీసులు కొందరు వారి వద్దకు వెళ్లి స్టేషన్‌కు రావాలని బెదిరిస్తున్నారు. తల్లిదండ్రులను కూడా స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ చేయాల్సి ఉంటుంది కాబట్టి, సమాచారం ఇచ్చేందుకు వారి ఫోన్ నంబర్ ఇవ్వాలంటూ భయాందోళనకు గురిచేస్తారు. ఇంట్లో తెలిస్తే ... మిగతా 6వ పేజీలో

విశాఖకు సెమీ రింగ్ రోడ్డు

- రాంబిల్లి నుంచి తాళ్లపాలెం, కొత్తవలస, విజయనగరం మీదుగా భోగాపురం వరకూ నిర్మాణానికి ప్రతిపాదన
- నివేదిక తయారీకి కన్సల్టెంట్ నియామకం కోసం వీఎంఆర్‌డీఏ ప్రకటన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



రాష్ట్ర రాజధాని అమరావతికి రింగ్ రోడ్డు నిర్మిస్తున్నట్టే ఆర్థిక రాజధాని విశాఖపట్నానికి కనీసం ఓ రింగ్ రోడ్డు ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. విశాఖ నగరానికి ఓ వైపు సముద్రం, మూడు వైపులా కొండలు ఉండడం వల్ల అమరావతిలా పూర్తి రింగ్ రోడ్డు నిర్మించే అవకాశం లేదు. అందుకని సెమీ రింగ్ రోడ్డు అయినా ప్లాన్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలోనే జిల్లా అధికారులకు ఆదేశించారు. దీనిపై విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం నగరం మధ్య నుంచి జాతీయ రహదారి వెళుతోంది. విశాఖ నుంచి భీమిలి మీదుగా భోగాపురం వరకు కోస్టల్ కారిడార్ ప్రతిపాదన కేంద్ర ... మిగతా 6వ పేజీలో

19న డిప్యూటీ మేయర్ ఎన్నిక

పదవి కోసం ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ పదవి కోసం కూటమి కార్పొరేటర్లలో పలువురు పోటీపడుతున్నారు. తమకు సన్నిహితంగా ఉండే ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ మేయర్ ఎంపికను సీఎం చంద్రబాబునాయుడుకు విడిచిపెట్టేయాలని మేయర్‌తోపాటు ప్రజా ప్రతినిధులు నిర్ణయించారు. ఈ విషయమై అమరావతిలో బుధవారం సీఎంతో జరిగే సమావేశం కోసం మేయర్‌తోపాటు ఎమ్మెల్యేలంతా మంగళవారం రాత్రి బయలుదేరి వెళ్లారు.



- ఎంపికలో సామాజికవర్గాల సమీకరణలే కీలకం
- యాదవ, కాపు సామాజికవర్గాల మధ్యే పోటీ
- ఎవరికివారు ముమ్మర ప్రయత్నాలు
- ఏం చేయాలనేదానిపై తలలుపట్టుకుంటున్న మేయర్, ప్రజాప్రతినిధులు
- ముఖ్యమంత్రి వద్దకు చేరిన పంచాయితీ
- నేడు చంద్రబాబును కలవనున్న మేయర్, నగర ఎమ్మెల్యేలు

జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారితోపాటు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో ఇద్దరూ పదవి కోల్పోయారు. కొత్త మేయర్‌గా టీడీపీకి చెందిన 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఎన్నికవ్వగా, డిప్యూటీ మేయర్ ఎన్నిక ఈ నెల 19న జరగాల్సి ఉంది. డిప్యూటీ మేయర్ పదవి కోసం పలువురు కార్పొరేటర్లు పోటీపడుతున్నారు. మేయర్ పదవి నుంచి తప్పించిన గొలగాని హరి వెంకటకుమారి యాదవ సామాజిక వర్గానికి చెందినవారు అయినందున... డిప్యూటీ మేయర్ పదవిని తమకు కేటాయించాలని ఆ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో సామాజిక వర్గం నుంచి ఒత్తిడిని ఎదుర్కొనాల్సి వస్తుందని ప్రజాప్రతినిధుల ముందు వాదన వినిపిస్తున్నారు. డిప్యూటీ మేయర్ పదవి కోసం యాదవ సామాజిక వర్గం నుంచి ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణితోపాటు 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పోటీ పడుతున్నారు. వైసీపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి, స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఉంటూనే సాధారణ ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు కూడా ఈ పదవిని తనకు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇదిలావుండగా కాపు సామాజిక వర్గానికి చెందిన జియ్యాని శ్రీధర్‌ను పదవి నుంచి తొలగించినందున అదే వర్గానికి చెందిన వారికి కేటాయించడం ద్వారా సామాజిక సమతుల్యాన్ని పాటించాలని ఆ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు పట్టుబడుతున్నారు. ప్రధానంగా 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావులు డిప్యూటీ మేయర్ పోస్టు కోసం తమవంతు ప్రయత్నాలను ముమ్మరంగా సాగిస్తున్నారు. పార్టీలో సీనియారిటీని, జీవీఎంసీలో గత నాలుగేళ్ల వైసీపీ పాలనపై కౌన్సిల్‌లో పోరాటం చేయడం వంటి అంశాలను ... మిగతా 6వ పేజీలో

ఉచితంగా ప్రైవేట్ విద్య

- జిల్లాలో 621 పాఠశాలల్లో ప్రవేశాలకు అవకాశం
- ఈ నెల 19 వరకు దరఖాస్తుకు గడువు
- రాష్ట్ర సిలబస్‌తో పాటు సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఐబీలలో ప్రవేశాలు

-8లో



త్రివర్ణ వెలుగులు

సిందూర్ విజయోత్సవం

'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఉగ్రవాదులపై విజయవంతంగా దాడులు నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను జాతీయ జెండా రంగులతో కూడిన విద్యుద్దీపాలతో అలంకరించారు. విశాఖలో రైల్వే స్టేషన్, డీఆర్ఎం కార్యాలయాలను మంగళవారం సాయంత్రం కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో కూడిన విద్యుద్దీపాలతో అలంకరించారు. దేశభక్తిని, విజయోత్సవాన్ని ఇది ప్రతిబింబిస్తుందని రైల్వే వర్గాలు తెలిపాయి.

-విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

తవుడు ముసుగులో గంజాయి రవాణా

- ఒడిశా నుంచి నగరానికి...
- 200 కిలోల గంజాయి స్వాధీనం
- నలుగురి అరెస్టు

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి):

తవుడు రవాణా ముసుగులో గంజాయి తరలిస్తున్న నలుగురు ఒడిశా వాసులను టాస్క్‌ఫోర్స్ ఆనందపురం పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. వారి నుంచి 200 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ-1 అజిత వేజెండ్ల దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒక బొలేరో వాహనంలో గంజాయి రవాణా అవుతున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో ఆనందపురం పోలీసుల సహకారంతో బోయిపాలెం జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఆనందపురం వైపు నుంచి నగరంలోకి వస్తున్న ఒక బొలేరో వాహనం, దాని ముందున్న బైక్ తిరిగి వెనక్కి వెళ్లిపోబోయాయి. వాటిని గుర్తించిన ఆనందపురం సీఐ సీహెచ్ వాసునాయుడు తన సిబ్బందితో కలిసి వెంబడించి ఆపారు. బొలేరోలో చూడగా తవుడు బస్తాలు కనిపించాయి. అయితే తమను చూసి వెనక్కి వెళ్లిపోవాల్సిన అవసరం ఏముందనే అనుమానంతో లోడును క్షుణ్ణంగా తనిఖీ చేయగా, నాలుగు బస్తాల్లో 40 గంజాయి ప్యాకెట్‌లు కనిపించాయి. వాటిని తూకం వేయగా 200 కిలోలు ఉన్నట్టు డీసీపీ వివరించారు. బొలేరో వాహనంలో ఉన్న ముగ్గురితోపాటు బైక్ మీద పైలట్‌గా వచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా...ఒడిశాలోని కోలాపూర్ జిల్లా నుంచి గంజాయిని విశాఖ తీసుకువస్తున్నారని తేలిందన్నారు. విశాఖలో విక్రయించాలని నిందితులు పథకం రచించారన్నారు. బొలేరో వాహనంలో ఉన్న కోరాపుట్ జిల్లా జమ్మగుడ గ్రామానికి చెందిన రఘు హంటల్ (27), హోరగుడకు చెందిన నరేంద్ర పాంగి (28), కోరాపుట్ జిల్లా పుజారిపుట్ ... మిగతా 6వ పేజీలో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ అజిత వేజెండ్ల

ఆరోగ్యప్రదాయిని అప్పన్న ఒలుపు చందనం


భక్తులకు విక్రయిస్తున్న చందనం ప్యాకెట్లు

సింహాచలం, మే 13 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామిపై ఏడాది పొడవునా పూతగా ఉన్న చందనం వైశాఖ మాస శుక్లపక్ష తృతీయనాటి నిజరూప దర్శనం కోసం తొలగిస్తారు. ఆ విధంగా తొలగించిన నిర్మాల్య చందనం (ఒలుపు చందనం)ను భక్తులు మహాప్రసాదంగా, ఆరోగ్యప్రదాయినిగాభావిస్తారు. ఈ ఏడాది గత ఏప్రిల్ 30 నాటి చందనోత్సవం రోజున స్వామిపై నుంచి తొలగించిన చందనం సుమారు 100కిలోలు వచ్చింది. దానిని ప్యాకెట్లుగా తయారు చేసి భక్తులకు విక్రయాలు చేస్తున్నారు.

ఈ ఒలుపు చందనం ప్రాముఖ్యతకు కారణం ఏమిటంటే.. ఆలయ వైదికులు చెప్పిన ప్రకారం ఏడాదిలో నాలుగు విడతలుగా 12 మణుగు (500 కిలో)ల పచ్చి చందనపు ముద్దను 32 రకాల సుగంధ ద్రవ్యాల చూర్ణాలతో కలిపి సమర్పిస్తారు. ఆ విధంగా సమర్పించిన చందనంతో నిత్యరూపంలో దర్శనమిచ్చే స్వామికి అనేక అర్చనాదులు నిర్వహించటం పరిపాటి. నిత్యపూజలు కారణంగా ఒలుపు చందనాన్ని పవిత్రమైనదిగా, అందులో 32 రకాల సుగంధ ద్రవ్యాల చూర్ణాలు మిళితం చేయడంతో వాటిలోని ఆయుర్వేద లక్షణాలు వలన ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తుల అభిప్రాయం.

అందుకు అనుగుణంగా కొందరు భక్తులు తమ పూజా మందిరాల్లో ఉంచుకుని పవిత్ర పూజలు చేస్తుంటారు. కాగా మరికొందరు ఒలుపు చందనాన్ని చిటికెటు నీటిలో కలుపుకుని ఔషధంగా ప్రతినిత్యం సేవిస్తారు.

అప్పన్న నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, మే 13 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్ననిత్యాన్న ప్రసాద పథకానికి విజయనగరం ప్రాంతానికి చెందిన డా.వెంకటేశ్వరరావు దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో విరాళం కౌంటర్‌లోని సీనియర్ అసిస్టెంట్ వేంకటేశ్వరరావుకు మంగళవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం కలిపించి శేష వస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

పెట్రోల్ బంకుల్లో కనీస సదుపాయాలు కరువు

- అలంకారప్రాయంగా ఎయిర్ ఫిల్లింగ్ యంత్రాలు
- మరుగుదొడ్ల సౌకర్యం అంతంతే..
- ఫైర్ కంట్రోల్ కోసం కానరాని జాగ్రత్తలు
- కానరాని ఫిర్యాదుల పెట్టెలు
- పట్టించుకోని అధికారులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు




తాళ్లవలస వద్ద పెట్రోలు బంక్ వద్ద పనిచేయని ఎయిర్ ఫిల్లింగ్ యంత్రం

భీమునిపట్నం (రూరల్), మే 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై పెట్రోలు బంకుల్లో కనీస సదుపాయాలు లేకపోవడం వల్ల చాలా మంది వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పెట్రోల్ బంకుల నిర్వాహకులు కనీస ప్రమాణాలు పాటించకున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజాపులోవ నుంచి తగరపువలస వరకు మూడు, తగరపువలస నుంచి ఆనందపురం వరకు నాలుగు, ఆనందపురం నుంచి ఎండాడ వరకు నాలుగు, ఆనందపురం నుంచి పెందుర్తి వరకు అయిదు పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటిలో సదుపాయాలు కల్పించడానికి అధికారులు కొన్ని ప్రమాణాలను నిర్దేశించారు. ప్రమాదాలు జరిగినప్పుడు రక్షణ ఏర్పాట్లు, ఫైర్ పరికరాలు, ఇంజన్ ఆయిల్ విక్రయాలు, టైర్లకు గాలిని కొట్టే పరికరాలు ఉండాలి. వాహన చోదకులకు మూత్రశాలలు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించాలి. కానీ, ఒకటి రెండు బంకుల్లో మినహా మరెక్కడా ఇటువంటి సదుపాయాలు లేవు. వాహనదారులు ఫిర్యాదులు ఏమైనా చేస్తే వాటిని తీసుకోవడానికి ఫిర్యాదుల బాక్సులను అమర్చాలి. కొన్ని వాహనాల టైర్లకు నైట్రోజన్ గ్యాస్ మాత్రం నింపవలసి ఉంటుంది. అటువంటి సదుపాయం ఈ పరిధిలో ఏ బంకులో కూడా కనిపించదు. ఈ ప్రాంతంలో ఉన్న చాలా బంకుల్లో ఇటువంటి ఏ వనరులు, అవసరమైన సదుపాయాలు కూడా కన్పించడం లేదు. తాళవలస బంకులో మాత్రం కొన్ని సదుపాయాలు ఉన్నాయి. ముఖ్యంగా పెట్రోలు కొట్టించుకున్న వాహనాలకు గాలిని పెట్టడానికి ఉచితంగా యంత్రాలనుఅమర్చాలి. ఈ బంకుల్లో ఎక్కడా ఇటువంటి సదుపాయాలు లేవు. రెండు బంకుల్లో ఇటువంటివి ఉన్నా అక్కడ సిబ్బంది ఎవరూ ఉండటం లేదు. అందువల్ల అవి ఉన్నా కూడా ప్రయోజనం లేకుండా అయిపోయింది. ముఖ్యంగా వాహనాల టైర్లకు గాలి పెట్టుకునే అవకాశం లేనందు వల్ల రోడ్డు పక్క ఫిల్లింగు స్టేషన్లపై వీరు ఆధారపడుతున్నారు.

ఇటువంటి కేంద్రాలు ఆనందపురం మండల పరిధిలో అయిదు కిలోమీటర్ల పరిధిలో పది పన్నెండు ఉన్నాయి. బంకుల్లో పెట్రోలు కొనుగోలు చేసినప్పటికీ వాహనాల టైర్లకు గాలి పెట్టించుకునే అవకాశం లేనందువల్ల వీరు చార్జీలను చెల్లించి గాలిని పెట్టించుకోవలసి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి నిబంధనల మేరకు పెట్రోల్ బంకుల్లో వాహనదారులకు కల్పించాల్సిన కనీస వసతులపై ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

అప్పన్న ఆలయంలో భద్రతా చర్యలపై నిర్లక్ష్యం

- నిఘా వర్గాల సూచనలు పాటించని దేవస్థానం అధికారులు



సింహాచలం, మే 13 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయ భద్రతను అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పన్నస్వామి దర్శనానికి దేశం నలుమూలల నుంచి మాత్రమే కాకుండా ఇతర విదేశాల నుంచి కూడా పలువురు అన్యమతాలకు చెందిన పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే, ఆలయ రక్షణకు అధికారులు చేపడుతున్న చర్యలు దాదాపుగా శూన్యమనే చెప్పక తప్పదు. గతంలో పోలీసు శాఖకు చెందిన ఇంటెలిజెన్స్, ఆక్టోపస్, నిఘా వర్గాలు, ఎస్పీఎఫ్ ఉన్నతాధికారులు ఆలయ భద్రతకు సంబంధించి అనేక సూచనలను చేశారు. అయితే వాటిలో ఒకటి కూడా నేటివరకు కార్యరూపం దాల్చలేదనేది సత్యం. అటువంటి సూచనల్లో భాగంగా భక్తుల ప్రవేశ ద్వారాల వద్ద డోర్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు, వారి వద్ద ఉండే బ్యాగ్‌ల స్కానింగ్, వ్యక్తులను చెక్ చేసేందుకు హ్యాండ్ మెటల్ డిటెక్టర్లు, నిత్యంగస్తీ పెంచాలని అందుకు తగిన మెన్ సంఖ్య పెంచటం, టవర్ గస్తీ ఏర్పాటు వంటి ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

నిపుణుల సూచనల మాటెలా ఉన్నా ఆలయంలో రాత్రి పూట ఆలయంలో గస్తీ నిర్వహించే వేళ ఏదైనా అనూహ్య ఘటన జరిగితే ఆ సమయంలో బయట వారికి తెలియజేసేందుకు కావలసిన అలారం కూడా లేకపోవటం గమనార్హం. తాజాగా దేశంలో ఏర్పడిన యుద్ధ వాతావరణం నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని సూచనలిచ్చాయి. అందుకు అనుగుణంగా సింహాచల దేవస్థానం అధికారులు కనీస సమీక్ష కూడా నిర్వహించిన దాఖలాలు లేవు. ఇదే సమయంలో ఆలయంలోనికి భక్తులు వేలాది మంది భక్తులు నిర్భయంగా తమ వెంట బ్యాగులు, సెల్‌ఫోన్లు, చేతికి ప్రత్యేక ఎలక్ట్రానిక్ గడియారాలతో ప్రవేశిస్తున్నారు. అటువంటి వారితో సంఘ వ్యతిరేక శక్తులు కానీ, ఉగ్రవాదులు లేదా మతోన్మాదులు ప్రవేశించి అలజడి సృష్టించేందుకు అవకాశాలు లేకపోలేదన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఇటువంటి తరుణంలో ఇప్పటికైనా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని దేవాలయ అధికారులు రక్షణ వ్యవస్థను పటిష్టపరచాల్సి ఉంది.

కమనీయం అప్పన్న నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

సింహాచలం, మే 13 (ఆంధ్రజ్యోతి) :వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేపట్టి షోడశోపచారాలు సమర్పించారు. పాంచ రాత్రాగమశాస్త్ర విధానంలో కంంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు జరిపి వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ జీలకర్ర, బెల్లం, మాంగల్యధారణలు గావించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలను స్వామి వారికిచ్చి భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

సీఎంఆర్ సెంట్రల్‌లో 'శుభం' సందడి

మద్దిలపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ సెంట్రల్‌లో మంగళవారం సాయంత్రం 'శుభం' సినిమా బృందం సందడి చేసింది. సినిమా హీరోలు హర్షిత్‌రెడ్డి, చరణ్ పేరి శ్రీనివాస్, హీరోయిన్ షాలినిలతో సందర్శకులుముచ్చటించి సెల్ఫీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు ప్రవీన్ కండ్రేగుల మాట్లాడుతూ ప్రముఖ హీరోయిన్ సమంత నిర్మించిన 'శుభం' సినిమాను ప్రేక్షకులు ఆదరించడం సంతోషంగా ఉందన్నారు. విశాఖ నగరం సమీపంలోని భీమిలి నేపథ్యంలో సాగే సినిమాను నగర వాసులు విజయవంతం చేశారన్నారు. సినిమాలో కొత్త వారైనా అద్భుతంగా నటించారన్నారు. 'శుభం'సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న ఆలయ ట్రస్టు ప్రతినిధులు

భీమునిపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి) : భీమిలి శ్రీఐశ్వర్య వేంకటేశ్వరస్వామివారి ఆలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం స్వామివారికి ఉదయం విశేష హోమాలు, యాగశాలార్చనలు వైభవంగా చేపట్టారు. అనంతరం, పండిత సదస్యం, ఆరోగ్యం, సర్వదోష నివారణార్థం శ్రీసుదర్శన హోమం నిర్వహించారు. ఐశ్వర్యాభివృద్ధికి శ్రీ ఐశ్వర్య లక్ష్మీహోమాన్ని ఆలయ ప్రధానార్చకులు శేషాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం నగర పురవీధుల్లో శ్రీవారి రథోత్సవం కోలాటం, తప్పెటగుళ్ల, బీహార్ బాజా, సన్నాయి మేళతాళాలతో వైభవంగా సాగింది. గోవిందనామ స్మరణ చేస్తూ భక్తులు అధిక సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కె.శ్రీరామచంద్రమూర్తి, కేవీ భానోజీరావు, కె.శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టు కోశాధికారి పుశిరికల బంగార్రాజు పాల్గొన్నారు.

భాషకు మూలాధారం వ్యాకరణం

సింహాచలం, మే 13 (ఆంధ్రజ్యోతి) : భాషకు వ్యాకరణమే మూలాధారమని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పాలెపు బంగారు చిట్టి అన్నారు. అడివివరం శాఖాగ్రంథాలయాధికారి ఎన్వీ నరసింహం సారథంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం చేపట్టినకార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషలకు వ్యాకరణం జోడిస్తేనే శోభ చేకూరుతుందని, విద్యార్థి దశ నుంచే అందరూ భాషతోపాటు వ్యాకరణం పట్ల కూడా మక్కువ కలిగి ఉండాలన్నారు. కార్మిక నేత సీహెచ్‌ఎస్ఎన్ రాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కెఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.

తవుడు ముసుగులో గంజాయి రవాణా

... 5వ పేజీ తరువాయి

గ్రామానికి చెందిన బినయ మండల్ (30), రబీంద్ర ఖీల (24)లను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి బొలేరో వాహనంతోపాటు ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఆనందపురం సీఐ వాసునాయుడు, టాస్క్‌ఫోర్స్ సీఐ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ షురూ

... 5వ పేజీ తరువాయి

సర్దుబాటు చేస్తున్నారు.

అప్‌గ్రేడ్ కానున్న యూపీ పాఠశాలలు..

ఉమ్మడి జిల్లాలో 33 యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు.

బక్కన్నపాలెం (చినగదిలి మండలం), బంగారమ్మపాలెం, గోకులపాడు, గుర్రాజుపేట (ఎస్.రాయవరం), బవులువాడ, కుంచంగి, రామాపురం, సిరసపల్లి (అనకాపల్లి మండలం), చినఉప్పాడ (భీమిలి), చౌడుపల్లి, కొత్తపాలెం, కృష్ణాపురం, తాజంగి (చింతపల్లి), దండి సురవరం, దిబ్బపాలెం (చీడికాడ), దిబ్బపాలెం (అచ్యుతాపురం), దురువీధి (హుకుంపేట), జి.వెంకటాపురం, జంగాలపల్లి (మాకవరపాలెం), కరికంపుట్టు (ముంచంగిపుట్టు), కండేపల్లి (చోడవరం), కొడవటిపూడి (కోటవురట్ల), మల్లాం (బుచ్చెయ్యపేట), పల్లంపేట (పాయకరావుపేట), పెదపల్లి (ఎలమంచిలి), పోట్నూరు (పద్మనాభం), రమణయ్యపేట (నక్కపల్లి), రింతాడ (జీకే వీధి), నందివలస (అరకులోయ), కృష్ణాపురం (జి.మాడుగులు), ఆర్‌బీఎం యూపీ పాఠశాల (మహారాణిపేట), ముస్లిం తాటిచెట్లపాలెం ఉర్దూ యూపీ పాఠశాల (సీతమ్మధార) ఉన్నాయి.

విశాఖకు సెమీ రింగ్ రోడ్డు

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం వద్ద ఉంది. అంటే సగం రింగ్ రోడ్డుకు ప్లానింగ్ పూర్తయినట్టుగానే జిల్లా అధికారులు చెబుతున్నారు. మిగిలిన సగం రింగ్ రోడ్డును అనకాపల్లి జిల్లా రాంబిల్లి వద్ద ప్రారంభించి తాళ్లపాలెం, అనకాపల్లి (రాష్ట్ర జాతీయ రహదారిని తాకకుండా), కొత్తవలస మీదుగా విజయనగరం నుంచి భోగాపురం కలుపుతూ ఏర్పాటుచేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులు ఒక అంచనాకు వచ్చారు. ఇది అర్ధ చంద్రాకారంలో వస్తుంది. అనకాపల్లి, విశాఖపట్నాలను తాకకుండా వాటి పైనుంచి విజయనగరం మీదుగా భోగాపురం వరకు తీసుకువెళ్లాలని ఆలోచన. దీనికి అవసరమైన అలైన్‌మెంట్, రింగ్ రోడ్డు పొడవు, వెడల్పు, అవసరమైన భూములు, వంతెనల నిర్మాణం వంటి అంశాలపై అధ్యయనం చేసి ఒక నివేదిక తయారుచేయడానికి వీఎంఆర్‌డీఏ కన్సల్టెంట్లను ఆహ్వానిస్తూ ప్రకటన చేసింది. మూడు నెలల సమయం ఇచ్చి నివేదిక కోరతామని, ఆపై దానిని ప్రభుత్వానికి సమర్పించి ఆ తదుపరి చర్యలు చేపడతామని వీఎంఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి.

85 కి.మీ., ఆరు వరుసలు

వీఎంఆర్‌డీఏ ప్రతిపాదించిన సెమీ రింగ్ రోడ్డు (ఎస్‌ఆర్‌ఆర్) అనకాపల్లి-పెందుర్తి-ఆనందపురం మీదుగా భోగాపురం విమానాశ్రయం వరకు వస్తుందని, ఆరు వరుసల్లో ఉంటుందని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు తెలిపారు.

అంబరాన్ని తాకిన జట్లమ్మ అమ్మవారి సిరిమాను సంబరం


జట్లమ్మ అమ్మవారి ఘటాల ఊరేగింపు


సిరిమాను సంబరంలో కత్తిసాము


పాండ్రంగిలో సిరిమాను ఊరేగింపు

పద్మనాభం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండ్రంగి గ్రామంలో మంగళవారం నిర్వహించిన జట్లమ్మ అమ్మవారి సిరిమానోత్సవ సంబరం అంబరాన్ని తాకింది. భక్తుల జయ, జయ ధ్వానాల మధ్య సతకం పట్టు నుంచి సిరిమానును రాజవీధిలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ముందుగా గ్రామంలోని అమ్మవారి మందిరంలో పూజారులు బూర్లె గురునాయుడు, పకీరులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఘటాలతో ఊరేగింపుగా సిరిమాను వద్దకు చేరుకున్నారు. అక్కడ సిరిమాను చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం సంప్రదాయబద్ధంగా పాండ్రంగి నాగరాజు సిరిమానును అధిరోహించారు. అక్కడి నుంచి భక్తులు అత్యంత భక్తి ప్రపత్తులతో తాళ్లతో లాగుతూ సిరిమానును ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అదే సమయంలో వెన్ని వారి కుటుంబానికి చెందిన అంజలి రథం, బూర్లె, మైలపల్లి కుటుంబాలకు చెందిన ఇతర రథాలను కూడా సిరిమానుతో పాటు రాజవీధిలో మూడుసార్లు ఊరేగించారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి పెద్దసంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ మంత్రి ఆర్ఎస్‌డీపీ అప్పలనర్సింహరాజు, జనసేన భీమిలి ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, టీడీపీ నాయకులు నాగోతు నాగమణి, ఉత్సవ కమిటీ సభ్యులు రామరాజు, కుర్రపల్లి బాబు, వజ్రకుమార్ రాజు, రవిబాబు, అముజూరు అప్పారావు, పల్లి మహేష్, కొసర అప్పలనాయుడు, బోజరాజు అప్పలనాయుడు, బీఎస్ఎస్ శ్రీనివాసరావు, పతివాడ నాయుడు, కె.కృష్ణ, మహంతి అప్పలరమణ పాల్గొన్నారు.

ఉత్సవానికి విరాళం: జట్లమ్మ అమ్మవారి ఉత్సవానికి రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు నుంచి రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. పాండ్రంగి పంచాయతీ పరిధిలోని బర్లపేటలో ఉత్సవ కమిటీ సభ్యుడు పల్లా అప్పలరాముకు విరాళం మొత్తాన్ని ట్రస్టు చైర్మన్ రూపాకుల రవికుమార్ అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షురాలు టి.నాగమణి, ఇతర నాయకులు, కృష్ణారావు, వెంకటరావు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో ఖాకీల దందా

... 5వ పేజీ తరువాయి

ఇబ్బంది పడాల్సి ఉంటుందని, చెప్పొద్దని జంట వేడుకోగానే దీన్ని ఆసరాగా తీసుకుని వారి నుంచి వీలైనంత పిండేస్తున్నారు. ఇటీవల రుషికొండ ఐటీ సెజ్ సెంటర్‌లో ఇద్దరు మాట్లాడుకుంటుండగా ఒక కానిస్టేబుల్ వెళ్లి వారిని బెదిరించి, రూ.ఐదు వేలు డిమాండ్ చేశాడు. తమ వద్ద డబ్బుల్లేవని, ఫోన్‌పే నంబర్ చెబితే నగదు ట్రాన్స్‌ఫర్ చేస్తామని చెప్పడంతో, సమీపంలోని ఒక మద్యం దుకాణం వద్దకు పంపించి, యువతి ఫోన్ నుంచి రూ.ఐదు వేలు ట్రాన్స్‌ఫర్ చేయించారు. ఇలా ఫోన్‌పే ద్వారా నగదు రూపంలో వచ్చిన మొత్తాన్ని రాత్రి దుకాణం కట్టేసే సమయంలో లెక్కకట్టి సదరు కానిస్టేబుల్ తీసుకుని జేబులు వేసుకుని వెళ్లిపోతారు.

ఇలాంటి వ్యవహారం బీచ్‌రోడ్డులో నిత్యకృత్యంగా మారిందని మద్యం వ్యాపారులతోపాటు యువతీయువకులు చెబుతున్నారు. దీనిపై స్పెషల్‌బ్రాంచి పోలీసులకు సమాచారం అందడంతో బీచ్‌రోడ్డులోని మద్యం దుకాణాల వద్దకు వెళ్లి పోలీసులు ఫోన్‌పే ద్వారా సాగిస్తున్న వసూళ్ల గురించి ఆరా తీస్తున్నట్టు మద్యం వ్యాపారులు చెబుతున్నారు.

రెడ్డిపల్లిలో వైభవంగా బంగారమ్మతల్లి అనుపోత్సవం


బంగారమ్మ అమ్మవారి ఘటాల ఊరేగింపు


శక్తివేషాలు ప్రదర్శిస్తున్న దృశ్యం



రెడ్డిపల్లి బంగారమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు


ట్రాఫికలో ఇరుక్కుపోయిన కారు

పద్మనాభం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో భారీ హంగామా నడుమ బంగారమ్మ అమ్మవారి పండగ అనుపోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి గ్రామంలో ఘటాలను ప్రధాన వీధులలో ఊరేగించి సతకం పట్లు వద్ద నిలిపారు. గ్రామంలోని అమ్మవారి మందిరంలోను, అక్కడ ఉన్న చెట్టు వద్ద మహిళలు పూజలు చేశారు. వివిధ రకాల శక్తి డ్యాన్సులు, పులివేషాలు, కోలాటం తదితర వాటితో అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. అనంతరం అంజలి రథంతో పాటు మూడు ప్రధాన రథాలను ఊరేగించారు. అక్కడ నుంచి అమ్మవారి ఆలయానికి చేరుకొని భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం రెడ్డిపల్లి పండగ సందర్భంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సంబరాల సమయంలో వాహనాలు ఎక్కువగా రావడంతో రెడ్డిపల్లి జెడ్పీ పాఠశాల వద్ద ట్రాఫిక్ నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో సంబరాలకు విచ్చేసిన ఔత్సాహికులు ట్రాఫిక్‌లో చిక్కుకోవలసిన పరిస్థితి తలెత్తింది.

విశాఖకు ఉజ్వల భవిష్యత్తు



విజేతకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా

కొమ్మాది, మే 13 (ఆంధ్రజ్యోతి): విశాఖకు ఉజ్వల భవిష్యత్తు ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఇంటర్ హోటల్స్ క్రికెట్ టోర్నీ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. గంటా మాట్లాడుతూ విశాఖలో ఒబెరాయ్, మెఫెయిర్ వంటి ప్రముఖ సంస్థలతోపాటు కొత్తగా 25 వరకు స్టార్ హోటల్స్ రానున్నాయని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు అందుబాటులో వచ్చిన తర్వాత హోటల్స్, రిసార్టులకు డిమాండ్ పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. భీమిలి, మధురవాడ ప్రాంతం భవిష్యత్తులో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహక ప్రతినిధులు పాల్గొన్నారు.

తగరపువలస సంత తరలింపు జరగదా?


ప్రధాన రహదారి పక్కన నిర్వహిస్తున్న సంత

తగరపువలస, మే 13 (ఆంధ్రజ్యోతి) తగరపువలస ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న కూరగాయల సంతను ప్రైవేటు స్థలం నుంచి తరలిస్తామని కొన్నేళ్లుగా అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ముందుకు సాగడం లేదు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, విజయనగరం జిల్లాలోని భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ ప్రాంతాల నుంచి వందలాది మంది కూరగాయలు పండించే రైతులు ఉదయం 5 గంటలకే ఈ సంతకు చేరుకుని తమ కూరగాయలు అమ్ముతుంటారు. వందలాదిమంది రైతులు ఈ ప్రాంతానికి వస్తున్నా వారి కోసం తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు కూడా ఇందులో లేవు. ఆదివారం రద్దీ మరీ ఎక్కువగా కనిపిస్తుంది. రైతులు ఫుట్‌పాత్‌ల పైనా, డివైడర్లపైనా బుట్టలు పెట్టి అమ్మకాలు చేస్తుంటారు. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉండటం వల్ల జీవీఎంసీ అధికారులు కూడా ఏమీ చేయలేకపోతున్నారు. రోజువారీ అమ్మకందారులే కాకుండా సంత లోపల స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని చాలామంది అమ్మకాలు సాగిస్తుంటారు. లోపలకు వెళ్లడం కొనుగోలుదారులకు పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. వర్షం వస్తే అంతా బురదమయం. అడుగు కదపడం కూడా ఇబ్బందిగా ఉంటుంది. సమీపంలో రైతు బజారు కోసం స్థలాన్ని సేకరించి నిర్మాణాలు చేపట్టారు. అయినా తరలించకపోవడం వల్ల ఈ సమస్య కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఇరుకు ప్రాంతంలో ఉన్న ఈ సంత వల్ల చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ రేట్లు కూడా ఒక విధానం లేకుండా వ్యాపారులు నచ్చిన విధంగా అమ్మకాలు సాగిస్తుంటారు. ధరల పట్టిక కూడా ఎక్కడా కనిపించదు. రైతు బజారును ప్రారంభిస్తే చాలా సమస్యలు తీరుతాయని పలువురు సూచిస్తున్నారు.

19న డిప్యూటీ మేయర్ ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

పరిగణనలోకి తీసుకుంటే గంధం శ్రీనివాసరావుకు అవకాశం దక్కడం ఖాయమని పార్టీ నేతలు చెబుతున్నారు. కానీ యాదవ సామాజిక వర్గ మహిళను మేయర్ పదవి నుంచి అవిశ్వాసం ద్వారా తొలగించినందున తిరిగి అదే సామాజిక వర్గం నుంచి మహిళను మేయర్ పదవికి ఎంపిక చేయాల్సి ఉన్నప్పటికీ ప్రత్యేక పరిస్థితులు, పార్టీ పట్ల విధేయతను చూపడాన్ని దృష్టిలో పెట్టుకుని గవర సామాజిక వర్గానికి చెందిన పీలా శ్రీనివాసరావుకు అవకాశం ఇచ్చినందున.. కనీసం డిప్యూటీ మేయర్ పదవిని యాదవ వర్గానికి చెందిన మహిళకు కేటాయిస్తే బాగుంటుందని కొందరు ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. దీనిని కొందరు ఎమ్మెల్యేలు కూడా సమర్థిస్తుండడంతో యాదవ వర్గానికి చెందిన మహిళకు పదవిని కేటాయించడం దాదాపు ఖాయమని టీడీపీకి చెందిన ఒక కీలక ప్రజాప్రతినిధి అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం సీఎం సమక్షంలో జరిగే సమావేశంలోనూ ఇదే నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ఆయనన్నారు. అలాగైతే ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 17వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి మధ్య పోటీ నెలకొంటుంది కాబట్టి విద్యావంతురాలైన మొల్లి హేమలత వైపు సీఎం మొగ్గుచూపే అవకాశం ఉంటుంది. ఒకవేళ డిప్యూటీ మేయర్‌గా యాదవ మహిళను ఎంపిక చేస్తే టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా గంధం శ్రీనివాసరావుకు అవకాశం ఇవ్వడం ఖాయమని చెప్పుకోవచ్చు.

మరోవైపు డిప్యూటీ మేయర్ పదవిని తమకు కేటాయించాలని జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి పట్టుబడుతున్నప్పటికీ ఆమె సామాజిక వర్గానికే చెందిన వ్యక్తి పీలా శ్రీనివాసరావు మేయర్‌గా ఉండడం ఆమెకు అడ్డంకిగా మారింది. ఆ పార్టీలో మరొకరికి ఇవ్వాలనుకుంటే 22వ వార్డు కార్పొరేటర్ మూర్తియాదవ్, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డికి అవకాశం ఇవ్వాలి. కానీ మూర్తి యాదవ్ తాను ఎలాంటి పదవి తీసుకోనని స్పష్టం చేయగా, దల్లి గోవిందరెడ్డికి సామాజిక వర్గాల సమీకరణలు అడ్డుగా నిలిచాయి. వైసీపీ నుంచి ఆ పార్టీలో చేరిన వారికి ఇవ్వాలనుకున్నారే డిప్యూటీ మేయర్‌గా పోటీ చేసినపుడు బీ-ఫారం జారీలో సాంకేతిక ఇబ్బందులు వస్తాయి కాబట్టి ఇతరులకు అవకాశం లేదని కూటమి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఏదిఏమైనా కొత్త డిప్యూటీ మేయర్ ఎవరనేది అమరావతిలో బుధవారం సీఎం చంద్రబాబు సమక్షంలో మేయర్‌తోపాటు ఎమ్మెల్యేలతో జరిగే సమావేశంలో తేలుతుంది.



ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్

65వ వార్డులో సమస్యలను పరిష్కరించాలని వినతి

పెదగంట్యాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డులోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు మంగళవారం నగరంలో కలెక్టర్, గ్రేటర్ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కొండవాలు ప్రాంతాలు అధికంగా ఉన్న వార్డులో ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. చాలాచోట్ల తాగునీటి పైపు లైన్లు దెబ్బతిన్నందున మార్చాలని, గెడ్డల ఆధునీకరణ, పార్కుల సుందరీకరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇన్‌చార్జి కమిషనర్ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ పేర్కొన్నారు.

వర్షానికి కూలిన ఇంటి శ్లాబు



సీతానగరంలో కూలిన ఇంటి శ్లాబు

పెదగంట్యాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరంలో సోమవారం రాతి ఓ ఇంటి శ్లాబు కూలిపోయింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో నమ్మి సింహాచలానికి చెందిన ఇంటి స్లాబు కూలిపోయింది. శ్లాబు ముందు భాగం కూలి దానిని ఆనుకుని ఉన్న రేకుల షెడ్డుపై పడడంతో అదికూడా కూలిపోయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టీడీపీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, నమ్మి అప్పారావు, ఇంటక్ ప్లాంట్ నాయకుడు వంశీకృష్ణలు మంగళవారం ఉదయం ఆ ఇంటిని పరిశీలించారు. ఈ విషయాన్ని మండల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధితునికి తగిన సహాయం అందించాలని కోరారు.

విద్యాలయాల్లో అడ్మిషన్లు ప్రారంభించాలి

ఉక్కుటౌన్‌షిప్, మే 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో గల విశాఖ విమల విద్యాలయం (వీవీవీ), కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. కేవీలో 1, 11వ తరగతులకు, వీవీవీలో ఒకటో తరగతికి ఈ ఏడాది అడ్మిషన్లను నిలిపివేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందువల్ల ఆయా విద్యాలయాల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు.

సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 13, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 24, పచ్చిమిర్చి 22, కాకరకాయలు 40, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 16, క్యారెట్ 38 దొండకాయలు 24, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 48, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 90, బద్దచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 90, కీరదోస 34, క్యాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 38, కంద 84, దేముడు చిక్కుడు 34, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

జోరుగా తాటిముంజల విక్రయాలు

పలు కూడళ్లలో డజను రూ.50-60 మధ్య అమ్మకాలు

గాజువాక/కూర్మన్నపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో లభించే తాటిముంజలకు ఎప్పుడూ మంచి గిరాకీ ఉంటుంది. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు, చలువ చేసేందుకు తాటిముంజలు తింటే ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని చాలామంది నమ్ముతుంటారు. అందుకే వీటిని కొనుగోలు చేసేందుకు అత్యధికులు ఆసక్తి కనబరుస్తుంటారు. అయితే పారిశ్రామిక ప్రాంతంలో తాటిచెట్లు అందుబాటులో లేకపోవడంతో విజయనగరం జిల్లా ఎస్.కోట, దేవరాపల్లి, అనకాపల్లి, విశాఖ రూరల్ ప్రాంతాల నుంచి తాటికాయలు, తాటిముంజలను ఇక్కడకు తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్నారు. ఆటోలు, వ్యాన్‌లలో వీటిని తీసుకువచ్చి గాజువాక, కూర్మన్నపాలెం తదితర ప్రాంతాల్లోని కీలక కూడళ్లలో విక్రయిస్తున్నారు. వీటి కొనుగోలుకు అత్యధికులు ఆసక్తి చూపుతుండడంతో మధ్యాహ్నం రెండు, మూడు గంటలకల్లా తాము తెచ్చినవన్నీ అమ్ముడైపోతున్నాయని పలువురు వ్యాపారులు ఆనందంగా చెబుతున్నారు. డజను తాటిముంజులు రూ.50 నుండి రూ.60 మధ్య ధర పలుకుతోంది. కాగా కొంతమంది పురవీధుల్లో బుట్టల్లో తాటిముంజలను ఇళ్లకు వద్దకు తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్నారు.





కణితి జంక్షన్‌లో తాటిముంజలను విక్రయిస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్లో) కూర్మన్నపాలెం కూడలిలో అమ్మకాలు

ఆరోగ్యానికి మంచిదని..

ఎక్కువ మొత్తంలో శక్తి, తక్కువ మొత్తంలో కేలరీలు తాటిముంజుల్లో ఉంటాయి. అందుకే మండు వేసవిలో వీటిని తినడం శరీరానికి ఎంతో మంచిది. అంతేగాక వేసవిలో ముఖంపై వచ్చే మొటిమలకు తాటిముంజలు ద్వారా ఎంతో కొంత ఉపశమనం కలుగుతుంది. అలాగే శరీరానికి కావాల్సిన చక్కెర, మినరల్స్‌ను పుష్కలంగా అందిస్తాయి. వీటిలో అధిక మొత్తంలో కాల్షియం, ఐరన్ ఉంటాయి. తాటిముంజలను తినడం వల్ల జీర్ణ వ్యవస్థ చురుగ్గా పనిచేయడమే కాకుండా ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు కూడా పరిష్కారమవుతావుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాగా చాలా మంచి తాటిముంజలపై పొరను తీసి తింటుంటారు. అయితే ఆ పొరలో ఎన్నో రకాల పోషకాలు ఉంటాయి. పొట్టు తియ్యకుండా ముంజలను ఆరగిస్తే శరీరానికి మరింత ఎక్కువ చలువ చేస్తుంది.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపం-2 పథకం ద్వారా పేదలకు ఎంతో భరోసా కలుగుతుందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. పేదల కష్టాలను తీర్చేందుకు దీపం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కోటీ యాభై లక్షల మందికి ఈ పథకంగా లబ్ధి కలుగుతుందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో భాస్కరరావు, ఏఎస్‌వో కృష్ణ, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, ముర్తజా తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం: కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

అగనంపూడి, మే 13 (ఆంధ్రజ్యోతి): వార్డు పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించడమే తన ధ్యేయమని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. అగనంపూడి, ఎన్టీఆర్ నగర్, అన్నపూర్ణా నగర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల మధ్యే మురుగు నిలిచిపోతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు కార్పొరేటర్‌కు తెలిపారు. సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట టీడీపీ నాయకులు గల్లా రాజు, రుద్రకుమార్, ఎం.వెంకటరావు, సింహాచలం, డి.సన్యాసిరావు, దేముడు, భరత్, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.



కార్పొరేటర్‌కు సమస్యలను వివరిస్తున్న స్థానికుడు

దోమల నివారణకు ఫాగింగ్

గ్రేటర్ 79వ వార్డు పరిధిలో దోమల నివారణకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్టు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్‌ను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు.

టీడీపీ కార్యకర్తలు దాడి చేశారంటూ సీపీకి బీవీ రామ్ ఫిర్యాదు

గాజువాక, మే 13 (ఆంధ్రజ్యోతి): గాజువాకలో సోమవారం తనపై కొంతమంది తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలు దాడి చేశారని, వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ మంగళవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి ఫిర్యాదు చేశారు. గాజువాకలోని ఓ హోటల్‌లో తాను ఉండగా టీడీపీకి చెందిన కొంతమంది వ్యక్తులు వచ్చి తనపై దాడి చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. అకారణంగా తనపై దాడి చేశారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వృథాగా పోతున్న నీరు

మల్కాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): కోరమండల్ ఎరువుల కర్మాగారం నుంచి నెలరోజులుగా నీరు ఏరులై పారుతోంది. దీంతో స్థానికులు 'ఇది ఏ నీరు అయుంటుందని? అనుమాన పడుతున్నారు. కోరమండల్ కంపెనీ యాజమాన్యం ఈ నీటి వృథాపై కనీసం స్పందించకపోవడంతో సంస్థ ఉద్దేశపూర్వకంగానే నీటిని ములగాడ గ్రామం వైపు మళ్లించారెమోనని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంస్థలో ప్రస్తుతం కాలువల నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో సముద్రంలోకి వెళ్లాల్సిన నీటిని ఈ విధంగా వదిలిపెట్టుంటారని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొంత మంది మంచినీటి పైపు పగిలిందేమోనని భావిస్తున్నారు. ఈ విధంగా నీరు వృథాగా పోవడం వల్ల పరిసర ప్రాంతాలన్ని బురద బురదగా మారుతున్నాయి. ఈ నీటి ప్రవాహం వల్ల అటుగా ప్రయాణాలు చేసేవారు జారీ పడిపోతున్నారని పలువురు అంటున్నారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చురుగ్గా రహదారి నిర్మాణ పనులు

గోపాలపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం ఐదుమదాల నుంచి నరవ గ్రామ శివారు సబ్బవరం బైపాస్‌ను కలిపే రహదారి నిర్మాణానికి రూ.2.30 కోట్ల నిధులు మంజూరు అవడంతో నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దశాబ్దాలుగా ప్రతిపాదనలోనే ఉన్న ఈ రహదారి నిర్మాణం జరగడం వల్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి నిర్మాణం వల్ల నరవ, జెర్రిపోతుల పాలెం, ఇప్పిలివానిపాలెం, నందవానిపాలెం, చింతగట్ల ప్రాంతాల ప్రజలు వెంకటాపురం మీదుగా ఎల్‌జీ పాలిమర్స్ కూడలి దగ్గర బీఆర్‌టీఎస్‌కు చేరుకుని పెందుర్తి, సింహాచలం వెళ్లడానికి ఎంతో సులభంగా ఉంటుంది. అదే విధంగా కొత్తపాలెం పరిసర ప్రాంతాల ప్రజలు ఈ మార్గం నుంచి నరవ గ్రామశివారులో సబ్బవరం వెళ్లే బైపాస్ రహదారిని సులభంగా చేరుకోవచ్చు.



రహదారి నిర్మాణపనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ అధికారులు స్థానిక నేతలు

ప్రస్తుతం నరవ-వెంకటాపురం గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఈ రహదారి నుంచి రాకపోకలు సాగించేవారు ప్రధాన రహదారిని చేరుకోవాలంటే వెంకటాపురం గ్రామంలోని ఐదుమదాల మార్గం నుంచి రాకపోకలు సాగించాల్సిం ఉంటుంది. అయితే ఐదుమదాల మార్గంలో రహదారి నిర్మాణం జరగక పోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పవు. రైల్వే సమస్య కారణంగా నిలిచిపోయిన ఐదుమదాల రహదారి నిర్మాణం కోసం నేతలు దృష్టిపెడితే రాకపోకలకు మరింత సౌకర్యంగా ఉంటుందని శివారు ప్రాంత ప్రజల కోరుతున్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి

- ప్రారంభించని పనులను 15 రోజుల్లోగా మొదలుపెట్టాలి
- ఇంజనీరింగ్ అధికారులకు మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశం

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): వార్డులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను రెండు నెలల్లోగా పూర్తిచేయాలని మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కూటమి కార్పొరేటర్లు, ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం తనఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. మంజూరై, టెండర్లు కూడా పూర్తయిపోయినప్పటికీ ఇంకా ప్రారంభం కాని పనులు ఉంటే వాటిని 15 రోజుల్లోగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టంచేశారు. కార్పొరేటర్లు తమ వార్డులో వివిధ పనులు జరుగుతున్న తీరుపై అభిప్రాయాలు తెలపడంతోపాటు ఫిర్యాదు కూడా చేశారు. ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డులో మౌలికసదుపాయాల కల్పనకు సంబంధించి పనులు చేయాల్సివున్నట్టయితే వాటికి సంబంధించిన ప్రతిపాదనలను తనకు లేదా అధికారులకు అందజేయాలని కార్పొరేటర్లకు సూచించారు. ప్రతీవార్డుకు రూ.రెండు కోట్లు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.

జుత్తాడ రహదారిని పరిశీలించిన కలెక్టర్

వీఎంఆర్డీఏ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచనలు

వేపగుంట, మే 13(ఆంధ్రజ్యోతి): వేపగుంట నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకుని ఉన్న జుత్తాడ రహదారి ప్రాంతాన్ని మంగళవారం విశాఖ జిల్లా కలెక్టర్ హరింధిర ప్రసాద్ అధికారులతో కలిసి పరిశీలించారు. 100 అడుగుల రహదారి నిర్మాణానికి ఉన్న సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ రహదారిలో కొంత అటవిశాఖ, ఇతర శాఖల నుంచి అనుమతులు తీసుకుని త్వరగా నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వీఎంఆర్డీఏ, రెవెన్యూ ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందజేయాలని వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా వేపగుంట నుంచి పినగాడి రహదారిని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీసీపీ ప్రభాకర్, జెడ్సీ కె.హైమావతి, ఇతర పలు ముఖ్య విభాగ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సైనికుల కోసం పూజలు

పెందుర్తి, మే 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ గాయపడ్డ సైనికులు త్వరగా కోలుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ జనసేన పార్టీ శ్రేణులు సుజాతనగర్ సమీపం రత్నగిరి నగర్‌లో కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గల సుబ్రహ్మణ్యం స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు అయితి సింహాచలం, పిళ్లా జగన్మోహనపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కరాస దుర్గాలమ్మ, బంగారమ్మ ఉత్సవాలు

ఎన్ఏడీ.జంక్షన్, మే 13(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు పరిధి కరాస పరిసర ప్రాంతాల ఆరాధ్య దైవం శ్రీదుర్గాలమ్మ, బంగారమ్మ అమ్మవారి పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం, అర్చనలు, ప్రత్యేక ఆలంకరణ, కుంకుమ పూజలు చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు వచ్చి మొక్కలు చెల్లించుకున్నారు. అమ్మవారికి విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు పూజలు చేశారు. కరాస హౌసింగ్ ఓనర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా స్థానిక కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు వై.తిరుమలరావు, క్లస్టర్ ఇన్‌చార్జి మహంతి చంద్రశేఖర్, నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



11 మంది 'ఉక్కు' కార్మిక సంఘ నాయకులకు షోకాజ్ నోటీసులు

- వీరిలో నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్?
- నేడు స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం కూడలి వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, మే 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులోని 11 మంది కార్మిక సంఘ నాయకులకు యాజమాన్యం మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అంతేకాక వీరిలో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్టు తెలిసింది. ఈ నెల 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా మంగళవారం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నాయకులు ప్లాంటులోని బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సమ్మె ప్రచారం చేపట్టారు. అయితే ఇది ప్లాంట్ నిబంధనలకు విరుద్ధమని, పని ప్రదేశం వదిలివెళ్లడాన్ని తప్పుపడుతూ కార్మిక నాయకులకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం కొద్దిమందికి మాత్రమే నోటీసులు ఇచ్చారని, మిగతా వారికి బుధవారం ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది. కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని మిగతా నాయకులు తప్పుపట్టారు. ఇందుకు నిరసనగా బుధవారం ఉక్కు పరిపాలన భవనం జంక్షన్ వద్ద ధర్నా చేయనున్నట్టు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు తెలిపారు.

వైభవంగా కుంచుమాంబ అనుపోత్సవం

గాజువాక, మే 13 (ఆంధ్రజ్యోతి): గాజువాక పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత శ్రీకుంచుమాంబ అనుపోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించేందుకు పారిశ్రామిక ప్రాంతంతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. సౌత్ ఏసీపీ త్రినాథ్ పర్యవేక్షణలో గాజువాక సీఐ పార్థసారథితో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను కణితి రోడ్డులోకి మళ్లించారు.

75వ వార్డులో ముగిసిన కుంచుమాంబ ఉత్సవాలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి కోరాడలో 15 రోజులుగా జరుగుతున్న శ్రీకుంచుమాంబ ఉత్సవాలు మంగళవారం సాయంత్రం జరిగిన అనుపోత్సవంతో ముగిశాయి. పూజాది కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులతో పాటు మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి, తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అమ్మవారి అమ్మవారిని ఊరేగించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు గొందేశి వెంకటరమణ, బి.పేరైడ్డి, జి.ప్రభాకరరెడ్డి, ఎస్.అప్పారావు, వి.సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.



బొర్రమాంబ నెల పండగ



పూజలందుకున్న బొర్రమాంబ

అగనంపూడి: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత ప్రాంతాల ఆరాధ్య దేవత బొర్రమాంబ నెల పండగను ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపుకుంకుమలు, పట్టు వస్త్రాలను సమర్పించగా, అధిక సంఖ్యలో భక్తులు బొర్రమాంబను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్రా గణేశ్, స్థానిక నాయకులు బి.నాగేశ్వరరావు, కె.సత్యారావు, ఎం.నరసింగరావు, జి.రాజు, సీహెచ్ కనకరాజు, ఎం.శ్రీను, గుర్రం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి జాతరను ఐక్యంగా నిర్వహించాలి

- గ్రామస్థుల విజ్ఞప్తి

మల్కాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 59వ వార్డు గణపతినగర్‌లో స్థానికులకు పైడితల్లి అమ్మవారి పండగ భయం పట్టుకుంది. ప్రతి ఏడాది మే నెలలో అమ్మవారి పండుగ చేయడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తోంది. పోయిన ఏడాది కమిటీ మాత్రమే పండగను జరిపింది. అప్పుడు గ్రామంలో తొమ్మిది మంది వివిధ కారణాలతో చనిపోయారని స్థానికులు అంటున్నారు. ఈ సంవత్సరం పండుగను గ్రామంతో కలిసి చేయాలా లేదా కమిటీ మాత్రమే చేయాలా? అనే ప్రశ్న అందరిలోనూ చర్చనీయాంశంగా మారుతోంది. 'గ్రామంతో కలిసి పండుగను చేస్తే మనకి లాభం ఉండదని, మనం చేస్తేనే లాభం ఉంటుందని వాట్సాప్ గ్రూప్‌లో కమిటీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మధ్య జరిగిన సంభాషణ అందరిలోని కలకలం రేపుతోంది. ఏదిఏమైనా అందరూ కలిసి ఐక్యంగా పండుగను జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

పిల్లలకు సామాజిక విషయాలపై అవగాహన అవసరం

- జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, తదితరులు

మల్కాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక సమస్యలైన బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మత్తు పదార్థాల వినియోగం, నిరక్షరాస్యత, పర్యావరణ కాలుష్యం, మూఢనమ్మకాలు వంటి అంశాలపై మల్కాపురం శాఖ గ్రంథాలయంలో బాలల వేసవి శిక్షణ శిబిరంలో గ్రూప్ డిస్కషన్లు జరిగాయి. ఈ చర్చలను గ్రంథాలయాధికారి వి.అజేయ్‌కుమార్ నిర్వహించారు. ఈ చర్చలో శిబిరంలో ఉన్న పిల్లలు పాల్గొన్నారు. అనంతరం పిల్లలు రాసిన కథనాలు చదివారు. పది మంది కథలను ఇతరులకు వినిపించారు. ఇటువంటి కార్యక్రమాల నిర్వహించడం వల్ల చిన్నారుల్లో పఠనాశక్తి పెరుగుతుందని, సమస్య పరిష్కార శక్తి మెరుగవుతుందని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- ఏఐటీయూసీ సభ్యులు

పెందుర్తి, మే 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా 20న దేశవ్యాప్తంగా చేయబోతున్న సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ కోరింది. ఈ సందర్భంగా పెందుర్తి రాజుచెరువు దగ్గర ఆటోస్టాండ్ యూనియన్‌తో ఏఐటీయూసీ నేత ఎర్రిపల్లి రాంబాబు సమ్మె గురించి మంగళవారం పోస్టర్ ఆవిష్కరణ చేశారు.

ఘనంగా రోళ్ల పైడిమాంబ పండుగ

పెందుర్తి రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 95వ వార్డు పరిధి చీమలపల్లి ప్రజల ఆరాధ్య దేవత రోళ్ల పైడిమాంబ పండుగ ఆలయ ధర్మకర్త అయితి ఎర్నిబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామునే మహిళలు ఆలయానికి వెళ్లి అమ్మవారి విగ్రహానికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ, కార్పొరేటర్ ముమ్మన దేవుడు అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అయితి ఎర్రయ్య, దువ్వి అప్పారావు, కంచుబోయిన సంతోశ్ పాల్గొన్నారు. సాయంత్రం జతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

పెదగాడిలో మెట్టమాంబ పండుగ

మండలంలోని పెదగాడిలో మెట్టమాంబ పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి సర్పంచ్ కేశుబోయిన లావణ్యత్రినాథ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

సైనికులకు బ్రాహ్మణ సంఘం రూ.1.06 లక్షల విరాళం



కలెక్టర్‌కు విరాళం ప్రతిని అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

మహారాణిపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): భారత సైనిక సంక్షేమ నిధికి విశాఖలోని ఆరువేల నియోగి బ్రాహ్మణ సంఘం లక్షా ఆరువేల రూపాయలను విరాళంగా అందించింది. భారత్-పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ నేపథ్యంలో గాయపడిన సైనికుల సహాయార్థం మంగళవారం బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కలెక్టరేట్‌కు వెళ్లి రూ.1,06,871 విరాళాన్ని కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్‌కు అందజేశారు. కలెక్టర్‌ను కలిసినవారిలో అధ్యక్షుడు ఎస్.సూర్యప్రతాప్, ముళ్లపూడి కోటేశ్వరరావు, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

16న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా

కంచరపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెంలోని నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈ నెల 16న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఉప ప్రాంతీయ ఉపాధి కల్పనాధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. జాబ్‌మేళాలో 100 ఖాళీలు భర్తీచేయనున్నట్టు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, సేల్స్ మేనేజర్, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్టు వివరించారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖలో పనిచేయాల్సి ఉంటుంది. వార్షిక వేతనం రూ.3 లక్షలు ఉంటుంది. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగులు సంబంధిత వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. అన్ని ధ్రువపత్రాలతో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

తెన్నేటినగర్ పార్కు బాగుచేయాలని వినతి



జోనల్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేస్తున్న తెన్నేటినగర్ వాసులు

మాధవధార, మే 13 (ఆంధ్రజ్యోతి): మాధవధార ప్రాంతాల్లో మంగళవారం జోన్-5 జెడ్సీ బి.రాము అధికారులతో కలసి పర్యటించారు. పార్కులు పరిశీలించి నిర్వహణ కమిటీలతో మాట్లాడారు. ఇటీవల సమస్యలకు కారణమైన వంశీనగర్ గెడ్డ ప్రాంతంలోని నివాసితులతో మాట్లాడారు. అనంతరం తెన్నేటినగర్ వెళ్లిన జెడ్సీకి అక్కడి నివాసితుల సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందించారు. తెన్నేటినగర్ పార్క్‌లో మొక్కల పెంపకం, విద్యుత్ దీపాలు, పెయింటింగ్ పనులు చేపట్టాలని కాలనీవాసులు విన్నవించారు. జోన్-5 ఏఎంహెచ్‌ఓ సునీల్‌కుమార్, 50వవార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, ఎస్.ఈశ్వర్, అచ్చిబాబు తదితరులు హాజరయ్యారు.

నైపుణ్య శిక్షణపై ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ఇరువర్గాల ప్రతినిధులు

సీతమ్మధార, మే 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల, హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ మధ్య మంగళవారం గోల్డెన్ జూబ్లీ హాల్‌లో నైపుణ్య శిక్షణపై ఒప్పందాలు (ఎంఓయూ) జరిగాయి. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు నూతన పరిజ్ఞానంతో సమకాలీనంగా ఉండటం చాలా అవసరమని వివరించారు. అధ్యాపకులు కొత్త నైపుణ్యాలు నేర్చుకుని విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌పీసీఎల్ సీఈవో, కార్యదర్శి ఇమ్తియాజ్ అర్షద్ మాట్లాడుతూ తమ సంస్థ నిర్వహిస్తున్న వివిధ శిక్షణకార్యక్రమాలను వివరించారు. అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులు

సీతమ్మధార, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదో తరగతి, ప్లస్-2 పరీక్ష ఫలితాల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధిస్తూ శ్రీప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పదో తరగతి పరీక్షలకు 226 మంది విద్యార్థులు హాజరుకాగా సీహెచ్ హాసిని 500కి 488 మార్కులు, వి.భవాని 485, వి.చరిష్మ గీతిక 481, ఎస్‌వీ అరవింద్ 481, పి.అవయాక్ 480 మార్కులు సాధించారు. 42 మంది విద్యార్థులు 90 శాతంపైగా మార్కులు సాధించారు. ప్లస్-2లో 61 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా లీనిషా అగర్‌వాల్ 473, సంపద మహాపాత్రో 464, ఎస్.అశిస్ వర్ధన్ 451, పి.కార్తిక్ 450, ఎ.అవినాష్ 447, వి.అక్షయ రాజ్ 446 మార్కులు సాధించారని విద్యార్థులను అభినందించిన పాఠశాల డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాష్ తెలిపారు.

నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

» 23వ వార్డులో ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్ ఆకస్మిక తనిఖీలు



కెఆర్‌ఎం కాలనీలో అధికారులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

సీతమ్మధార, మే 13 (ఆంధ్రజ్యోతి): నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ హితవు పలికారు. జీవీఎంసీ జోన్ 3 పరిధి 23వ వార్డులో కెఆర్‌ఎం కాలనీ, చైతన్యనగర్, ఇందిరా ప్రియదర్శినీ కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కెఆర్‌ఎం కాలనీలో డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని ఆదేశించారు. ఇంటింటా చెత్త సేకరణ, తరలింపు ప్రక్రియను పరిశీలించి నిత్యం పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సంబంధిత బాధ్యులకు సూచించారు. కాలువలు, గెడ్డలను పరిశీలించి రానున్న వర్షకాలం దృష్ట్యా అన్ని వార్డులలోని గెడ్డలలో పూడికలు, వ్యర్థాలు తీయించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్‌వీ నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో జోన్ 3 జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఎంవోహెచ్ వి.ప్రసాదరావు, శానిటరీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏరో స్పేస్ రంగంలో శిక్షణకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో డా.రామకృష్ణ, అధికారులు

కంచరపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఏరో స్పేస్ రంగంలో శిక్షణకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పెందుర్తి కళాశాల నుంచి 25 మంది ఎంపికయ్యారు. వీరికి మంగళవారం నియామకపత్రాలను అందజేశారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 19 నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ డా.ఎ.వి.రామకృష్ణ మాట్లాడుతూ త్వరితగతిన విస్తరిస్తున్న ఏరోస్పేస్ రంగానికి అవసరమైన మానవవనరులను అందించేందుకు ఏరోస్పేస్ ఎకో సిస్టంపై పాలిటెక్నిక్ విద్యార్థులకు అవగాహన పెంచేందుకు ఆరు నెలల పారిశ్రామిక శిక్షణకు విశాఖలో ఎంపికలు జరిగాయన్నారు. ఇందులో విశాఖ, పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 92 మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో లిఖిత, మౌఖిక పరీక్షలో ప్రతిభ ప్రాతిపదికన 25 మందిని ఎంపికచేశారన్నారు. ఇప్పటికే ఈ ప్రత్యేక స్కిల్లింగ్ ప్రోగ్రాం ద్వారా నాలుగు బ్యాచ్‌లుగా 126 మందికి శిక్షణ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ డీజీఎం రోషిణి మిత్రా, సీనియర్ మేనేజర్ శేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కేడీవీ.నరసింహారావు, కె.మధుకుమార్, నాగమణి పాల్గొన్నారు.

విశాఖకు ఉజ్వల భవిష్యత్తు



విజేతకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా

కొమ్మాది, మే 13 (ఆంధ్రజ్యోతి): విశాఖకు ఉజ్వల భవిష్యత్తు ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఇంటర్ హోటల్స్ క్రికెట్ టోర్నీ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. గంటా మాట్లాడుతూ విశాఖలో ఒబెరాయ్, మెఫెయిర్ వంటి ప్రముఖ సంస్థలతోపాటు కొత్తగా 25 వరకు స్టార్ హోటల్స్ రానున్నాయని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు అందుబాటులో వచ్చిన తర్వాత హోటల్స్ రిసార్టులకు డిమాండ్ పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. భీమిలి, మధురవాడ ప్రాంతం భవిష్యత్తులో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ గ్రామదేవత పండుగ



కాళికాదేవి, పులివేషాలతో పురవీధుల్లో ఊరేగింపు

డాబాగార్డెన్స్, మే 13 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని కృష్ణాగార్డెన్స్ గ్రామదేవత దుర్గాలమ్మ పండుగ మహోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి పరశ, గరిడి, పులివేషాలు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం అమ్మవారిని తిరువీధుల్లో ఊరేగించారు. కాళికాదేవి వేషాలతో తప్పెటగుళ్లు, కోలాటం, కాంగో డప్పుల మధ్య అమ్మవారి పండుగ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దుర్గాలమ్మ ఆలయ గౌరవ అధ్యక్షుడు దొడ్డి బాపు ఆనంద్, కమిటీ ప్రెసిడెంట్ బొట్ట శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ దుక్క ఆనంద్, సెక్రటరీ కర్రి గణేష్, జాయింట్ సెక్రటరీ ఒమ్మి శేఖర్, కోశాధికారి ముగడ శ్రీనివాసరావు, జాయింట్ కోశాధికారి భరిణికాన వర్మ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు బాపు ఆనంద్ మాట్లాడుతూ 20న ఆలయ ఆవరణలో మహాఅన్నసమారాధన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలియజేశారు.

మానవత్వంలోనే దైవత్వం ఉంటుంది



అనాథాశ్రమంలో వడ్డిస్తున్న పైడి రజనీ

మహారాణిపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): మానవత్వంలోనే దైవత్వం ఉందని, అనాథలను, నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని ఏవీఎన్ కళాశాల విభాగాధిపతి, శక్తి ఎంపవరింగ్ విమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు పైడి రజనీ అన్నారు. మంగళవారం ప్రేమ సమాజంతో పాటు పలు వృద్ధాశ్రమాలలో భోజన వితరణతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పి.గోపాలరావు, సంస్థ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మరణించిన సైనికుడి పేరిట మంచినీటి ట్యాంక్



ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, మే 13 (ఆంధ్రజ్యోతి): సైనికుడిగా పనిచేసి వీరమరణం పొందిన తన సోదరుడు మజ్జి మోహన్‌కుమార్ రెడ్డి పేరిట వార్డు బీజేపీ నాయకుడు ఉమామహేశ్వరరెడ్డి మంచినీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. నక్కవానిపాలెంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గల అభయ దుర్గాదేవి ఆలయం వద్ద వార్డు ఉమామహేశ్వర రెడ్డి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంక్‌ను ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మంగళవారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ ట్యాంక్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భారత్-పాక్‌ల మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో వీర జవాన్ల సేవలను ప్రజలు ప్రస్తుతిస్తున్నారు. ఇలాంటి సమయంలో వీరమరణం పొందిన తన సోదరుడైన సైనికుడి పేరిట ట్యాంక్ ఏర్పాటు చేసి ప్రజలకు నీటిని అందించడం ముదావహమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రతినిధులు, ప్రజలు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఠారెత్తిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా మురళీనగర్ ప్రధాన రహదారి

మురళీనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండుటెండలు గుబులు పుట్టిస్తున్నాయి. మధ్య మధ్యలో చిరుజల్లులు కురుస్తాయన్న చల్లని కబురు వినిపిస్తున్నా, ప్రస్తుత పరిస్థితి ఊపిరాడనీయడం లేదు. సూర్యోదయం నుంచే పైపైకి చేరుతున్న గరిష్ట ఉష్ణోగ్రతలతో జనం బెంబేలెత్తుతున్నారు. వాతావరణ శాఖ అంచనాలను తిప్పికొడుతూ భానుడు ప్రతాపం చూపుతున్నాడు. మూడు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో మురళీనగర్, మాధవధార ప్రాంతాలు సహా ఉత్తర నియోజకవర్గ ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. మంగళవారం 48ఎ బస్ రూట్ ప్రధాన రోడ్లు, హైవే ప్రాంతాల్లోనూ వాహనాల రాక తగ్గింది. రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం రోడ్లపై 10 గంటల్లోపు, తిరిగి సాయంత్రం పొద్దుపోయాక గాని ప్రజలు బయట ప్రాంతాల్లో కానరావడం లేదు. దుకాణాలు సైతం మూసేసి వ్యాపార వేళలను పరిమితం చేసుకుంటున్నారు. ఎంత వేగం వర్షం కురిసి వాతావరణం ఉపశమనం కలిగిస్తుందోనని ప్రజలు ఆశగా చూస్తున్నారు.

జోన్-4లో వీధి విక్రయదారుల సర్వే

వెంకోజీపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి): స్ట్రీట్ వెండర్ సర్వే 2025 సంబంధించి జోన్-4 పరిధిలో వార్డు నెంబరు 28 నుంచి 39 వార్డుల్లో గల వీధి విక్రయ వర్తక వ్యాపారుల సర్వే నిర్వహిస్తామని నాలుగో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. సూర్యాబాగ్ పరిధిలోని జీవీఎంసీ సచివాలయ సిబ్బందితో వీధి విక్రయ వర్తక వ్యాపారులకు సర్వే నిర్వహిస్తున్నందున వర్తకులు సహకరించాలన్నారు. స్ట్రీట్ వెండర్స్ సర్వేకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత 28 నుంచి 39 వార్డుల పరిధిలోని అన్ని సచివాలయాల్లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. వెండర్ తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, మొబైల్ నెంబర్, బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్ కాపీ, మ్యాక్సీసైజు ఫ్యామిలీ ఫోటోలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

రోడ్డుపై ఇలా...రాకపోకలు ఎలా?



జగన్నాథపురంలో రోడ్డుపై వేసిన పిక్క

అక్కయ్యపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 42వ వార్డు జగన్నాథపురంలోని రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో నిర్మిస్తున్న ఇళ్ల యజమానులు రోడ్డుపైనే డెబ్రిస్, పిక్క, ఇసుక, తదితర భవన నిర్మాణ సామగ్రి ఇష్టానుసారంగా వేసి రోడ్డును ఆక్రమించేస్తున్నారు. దీంతో రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉందని పాదచారులు, వాహనచోదకులు చెబుతున్నారు. రోడ్డుపై ఇలా భవన నిర్మాణ సామగ్రి వేసినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా ఎటువంటి సామగ్రి వేయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పోలమాంబను దర్శించుకున్న దక్షిణ ఎమ్మెల్యే



దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసిన శ్రీకృష్ణ సేవా సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెంలో నిర్వహిస్తున్న పోలమాంబ అమ్మవారు వార్షిక జాతర మహోత్సవాల్లో మంగళవారం దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పద్మజ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఉత్సవ నిర్వహకులైన శ్రీకృష్ణ సేవా సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితో పాటు గ్రామాభివృద్ధికి తనవంతు సహాయం ఎప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు, టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ సేవా సంఘం అధ్యక్షుడు దువ్వి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బుద్ధల కృష్ణ, కోశాధికారి దువ్వి వెంకటస్వామి, కార్యనిర్వహక కార్యదర్శి చెల్లిబోయిన సునీల్‌కుమార్, కార్యదర్శులు మువ్వల మౌళి, ఎం.హరి ప్రసాద్, సాంబశివరావు, ఒమ్మి అప్పారావు పాల్గొన్నారు.

ఉగ్రదాడులపై పెదజాలరిపేటలో మాక్ డ్రిల్

పెదవాల్తేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): అనూహ్య రీతిలో ఎదురయ్యే ఆపద, విపత్కర పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి క్లిష్టమైన పరిస్థితులు ఎదురైనా దీటుగా ఎదుర్కొనాలని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ రక్షణ దళాలు పెదజాలరిపేటలో టిడ్కో గృహ సముదాయం వద్ద మంగళవారం సాయంత్రంమాక్ డ్రిల్ నిర్వహించి చూపడం ద్వారా స్థానికుల్లో ధైర్యం నింపారు. ఉగ్రదాడులు జరిగితే ఎలా స్పందించాలో చూపుతూ అవగాహన కల్పించాయి. ప్రధానంగా.. తక్షణ సాయం ఎలా పొందాలి. ఆపద నుంచి ఎలా గట్టెక్కాలి అనే అంశాలపై నమూనా ప్రదర్శనలు చేసి అవగాహన కల్పించారు.

తవుడు ముసుగులో గంజాయి రవాణా

... 5వ పేజీ తరువాయి

గ్రామానికి చెందిన బినయ మండల్ (30), రబీంద్ర ఖిల (24)లను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి బొలేరో వాహనంతోపాటు ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఆనందపురం సీఐ వాసునాయుడు, టాస్క్‌ఫోర్స్ సీఐ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో ఖాకీల దందా

... 5వ పేజీ తరువాయి

ఇబ్బంది పడాల్సి ఉంటుందని, చెప్పొద్దని జంట వేడుకోగానే దీన్ని ఆసరాగా తీసుకుని వారి నుంచి వీలైనంత పిండేస్తున్నారు. ఇటీవల రుషికొండ ఐటీ సెజ్ సెంటర్‌లో ఇద్దరు మాట్లాడుకుంటుండగా ఒక కానిస్టేబుల్ వెళ్లి వారిని బెదిరించి, రూ.ఐదు వేలు డిమాండ్ చేశాడు. తమ వద్ద డబ్బుల్లేవని, ఫోన్‌పే నంబర్ చెబితే నగదు ట్రాన్స్‌ఫర్ చేస్తామని చెప్పడంతో, సమీపంలోని ఒక మద్యం దుకాణం వద్దకు పంపించి, యువతి ఫోన్ నుంచి రూ.ఐదు వేలు ట్రాన్స్‌ఫర్ చేయించారు. ఇలా ఫోన్‌పే ద్వారా నగదు రూపంలో వచ్చిన మొత్తాన్ని రాత్రి దుకాణం కట్టేసే సమయంలో లెక్కకట్టి సదరు కానిస్టేబుల్ తీసుకుని జేబులు వేసుకుని వెళ్లిపోతారు. ఇలాంటి వ్యవహారం బీచ్‌రోడ్డులో నిత్యకృత్యంగా మారిందని మద్యం వ్యాపారులతోపాటు యువతీయువకులు చెబుతున్నారు. దీనిపై స్పెషల్ బ్రాంచి పోలీసులకు సమాచారం అందడంతో బీచ్‌రోడ్డులోని మద్యం దుకాణాల వద్దకు వెళ్లి పోలీసులు ఫోన్‌పే ద్వారా సాగిస్తున్న వసూళ్ల గురించి ఆరా తీస్తున్నట్టు మద్యం వ్యాపారులు చెబుతున్నారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ షురూ

... 5వ పేజీ తరువాయి

సర్దుబాటు చేస్తున్నారు.

అప్‌గ్రేడ్ కానున్న యూపీ పాఠశాలలు..

ఉమ్మడి జిల్లాలో 33 యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. బక్కన్నపాలెం (చినగదిలి మండలం), బంగారమ్మపాలెం, గోకులపాడు, గుర్రాజుపేట (ఎస్.రాయవరం), బవులువాడ, కుంచంగి, రామాపురం, సిరసపల్లి (అనకాపల్లి మండలం), చినఉప్పాడ (భీమిలి), చౌడుపల్లి, కొత్తపాలెం, కృష్ణాపురం, తాజంగి (చింతపల్లి), దండి సురవరం, దిబ్బపాలెం (చీడికాడ), దిబ్బపాలెం (అచ్యుతాపురం), దురువీధి (హుకుంపేట), జి.వెంకటాపురం, జంగాలపల్లి (మాకవరపాలెం), కరికంపుట్టు (ముంచంగిపుట్టు), కండేపల్లి (చోడవరం), కొడవటిపూడి (కోటవురట్ల), మల్లాం (బుచ్చెయ్యపేట), పల్లంపేట (పాయకరావుపేట), పెదపల్లి (ఎలమంచిలి), పొట్నూరు (పద్మనాభం), రమణయ్యపేట (నక్కపల్లి), రింతాడ (జీకే వీధి), నందివలస (అరకులోయ), కృష్ణాపురం (జి.మాడుగులు), ఆర్‌బీఎం యూపీ పాఠశాల (మహారాణిపేట), ముస్లింతాటిచెట్లపాలెం ఉర్దూ యూపీ పాఠశాల (సీతమ్మధార) ఉన్నాయి.

విశాఖకు సెమీ రింగ్ రోడ్డు

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం వద్ద ఉంది. అంటే సగం రింగ్ రోడ్డుకు ప్లానింగ్ పూర్తయినట్టుగానే జిల్లా అధికారులు చెబుతున్నారు. మిగిలిన సగం రింగ్ రోడ్డును అనకాపల్లి జిల్లా రాంబిల్లి వద్ద ప్రారంభించి తాళ్లపాలెం, అనకాపల్లి (రాష్ట్ర జాతీయ రహదారిని తాకకుండా), కొత్తవలస మీదుగా విజయనగరం నుంచి భోగాపురం కలుపుతూ ఏర్పాటుచేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులు ఒక అంచనాకు వచ్చారు. ఇది అర్థ చంద్రాకారంలో వస్తుంది. అనకాపల్లి, విశాఖపట్నాలను తాకకుండా వాటి పైనుంచి విజయనగరం మీదుగా భోగాపురం వరకు తీసుకువెళ్లాలని ఆలోచన. దీనికి అవసరమైన అలైన్‌మెంట్, రింగ్ రోడ్డు పొడవు, వెడల్పు, అవసరమైన భూములు, వంతెనల నిర్మాణం వంటి అంశాలపై అధ్యయనం చేసి ఒక నివేదిక తయారుచేయడానికి వీఎంఆర్‌డీఏ కన్సల్టెంట్లను ఆహ్వానిస్తూ ప్రకటన చేసింది. మూడు నెలల సమయం ఇచ్చి నివేదిక కోరతామని, ఆపై దానిని ప్రభుత్వానికి సమర్పించి ఆ తదుపరి చర్యలు చేపడతామని వీఎంఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి.

85 కి.మీ., ఆరు వరుసలు

వీఎంఆర్‌డీఏ ప్రతిపాదించిన సెమీ రింగ్ రోడ్డు (ఎస్ఆర్ఆర్) అనకాపల్లి-పెందుర్తి-ఆనందపురం మీదుగా భోగాపురం విమానాశ్రయం వరకు వస్తుందని, ఆరు వరుసల్లో ఉంటుందని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు తెలిపారు.

19న డిప్యూటీ మేయర్ ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

పరిగణనలోకి తీసుకుంటే గంధం శ్రీనివాసరావుకు అవకాశం దక్కడం ఖాయమని పార్టీ నేతలు చెబుతున్నారు. కానీ యాదవ సామాజిక వర్గ మహిళను మేయర్ పదవి నుంచి అవిశ్వాసం ద్వారా తొలగించినందున తిరిగి అదే సామాజిక వర్గం నుంచి మహిళను మేయర్ పదవికి ఎంపిక చేయాల్సి ఉన్నప్పటికీ ప్రత్యేక పరిస్థితులు, పార్టీ పట్ల విధేయతను చూపడాన్ని దృష్టిలో పెట్టుకుని గవర సామాజిక వర్గానికి చెందిన పీలా శ్రీనివాసరావుకు అవకాశం ఇచ్చినందున.. కనీసం డిప్యూటీ మేయర్ పదవిని యాదవ వర్గానికి చెందిన మహిళకు కేటాయిస్తే బాగుంటుందని కొందరు ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. దీనిని కొందరు ఎమ్మెల్యేలు కూడా సమర్థిస్తుండడంతో యాదవ వర్గానికి చెందిన మహిళకు పదవిని కేటాయించడం దాదాపు ఖాయమని టీడీపీకి చెందిన ఒక కీలక ప్రజాప్రతినిధి అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం సీఎం సమక్షంలో జరిగే సమావేశంలోనూ ఇదే నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ఆయనన్నారు. అలాగైతే ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 17వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి మధ్య పోటీ నెలకొంటుంది కాబట్టి విద్యావంతురాలైన మొల్లి హేమలత వైపు సీఎం మొగ్గుచూపే అవకాశం ఉంటుంది. ఒకవేళ డిప్యూటీ మేయర్‌గా యాదవ మహిళను ఎంపిక చేస్తే టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా గంధం శ్రీనివాసరావుకు అవకాశం ఇవ్వడం ఖాయమని చెప్పుకోవచ్చు.

మరోవైపు డిప్యూటీ మేయర్ పదవిని తమకు కేటాయించాలని జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి పట్టుబడుతున్నప్పటికీ ఆమె సామాజిక వర్గానికే చెందిన వ్యక్తి పీలా శ్రీనివాసరావు మేయర్‌గా ఉండడం ఆమెకు అడ్డంకిగా మారింది. ఆ పార్టీలో మరొకరికి ఇవ్వాలనుకుంటే 22వ వార్డు కార్పొరేటర్ మూర్తియాదవ్, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డికి అవకాశం ఇవ్వాలి. కానీ మూర్తి యాదవ్ తాను ఎలాంటి పదవి తీసుకోనని స్పష్టం చేయగా, దల్లి గోవిందరెడ్డికి సామాజిక వర్గాల సమీకరణలు అడ్డుగా నిలిచాయి. వైసీపీ నుంచి ఆ పార్టీలో చేరిన వారికి ఇవ్వాలనుకున్నా సరే డిప్యూటీ మేయర్‌గా పోటీ చేసినపుడు బీ-ఫారం జారీలో సాంకేతిక ఇబ్బందులు వస్తాయి కాబట్టి ఇతరులకు అవకాశం లేదని కూటమి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఏదిఏమైనా కొత్త డిప్యూటీ మేయర్ ఎవరనేది అమరావతిలో బుధవారం సీఎం చంద్రబాబు సమక్షంలో మేయర్‌తోపాటు ఎమ్మెల్యేలతో జరిగే సమావేశంలో తేలుతుంది.

ఉగ్రదాడులపై పెదజాలరిపేటలో మాక్ డ్రిల్



క్షతగాత్రులను అందించాల్సిన సేవల గురించి వివరిస్తున్న సిబ్బంది

- ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల ఆధ్వర్యంలో నిర్వహణ
- విపత్కర సమయాల్లో అనుసరించాల్సిన తీరుపై స్థానికులకు అవగాహన
- ఆద్యంతం ఉత్కంఠగా సాగిన కార్యక్రమం


పెదవాల్తేరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : అనూహ్య రీతిలో ఎదురయ్యే ఆపద, విపత్కర పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి క్లిష్టమైన పరిస్థితులు ఎదురైనా దీటుగా ఎదుర్కోవాలని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ రక్షణ దళాలు మాక్ డ్రిల్ నిర్వహించి చూపడం ద్వారా స్థానికుల్లో ధైర్యం నింపారు. ఉగ్రదాడుల జరిగితే ఎలా స్పందించాలో చూపుతూ అవగాహన కల్పించాయి. ప్రధానంగా.. తక్షణ సాయం ఎలా పొందాలి. ఆపద నుంచి ఎలా గట్టెక్కాలి అనే అంశాలపై నమూనా ప్రదర్శనలు చేసి అవగాహన కల్పించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పెదజాలారిపేట టిడ్కో గృహ సముదాయం వద్ద నిర్వహించిన మాక్‌డ్రిల్ ఆసాంతం ఉత్కంఠగా సాగింది. అక్కడి పౌరుల్లో చైతన్యం నింపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు ఉగ్రదాడులపై అప్రమత్తం చేస్తూ ప్రత్యేకంగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో ప్రధానంగా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కీలకంగా వ్యవహరించాయి. టిడ్కో గృహల్లో పొగ బాంబులు పేలగా వాటిని అగ్నిమాపక యంత్రం సాయంతో మంటలను అదుపు చేశారు. క్షతగాత్రులను హుటాహుటిన తాత్కాలిక వైద్య శిబిరానికి తరలించారు. ప్రత్యేక జాగిలాలతో ప్రమాదం జరిగిన ప్రంతంలో తనిఖీలు చేపట్టారు. ఒకవేళ అనుకోని రీతిలో ప్రమాదం వాటిల్లితే ఎలా వ్యవహరించాలో స్పష్టంగా తెలియజేశారు.

బ్లాకౌట్ నిర్వహించిన అధికారులు, సిబ్బంది

రాత్రి మాక్‌డిల్ నిర్వహించిన అధికారులు, సిబ్బంది అదే ప్రాంతంలో రాత్రి బ్లాకౌట్ నిర్వహించాయి. టిడ్కో గృహ సముదాయాలు సమీప ప్రాంతంలో విద్యుత్ నిలిపివేసి కార్యకలాపాలను చేపట్టారు. శత్రుమూకలు మన ప్రాంతాలను గుర్తించడానికి వీలు లేకుండా విద్యుత్ నిలిపి వేయాలని, చీకట్లో ఉంటే ప్రమాదం తప్పుతుందని పేర్కొంటూ రక్షణ దళాలు అక్కడి వారికి అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్ కార్యక్రమంలో భీమిలి ఇన్‌చార్జి ఆర్డీవో సుధాసాగర్, జిల్లా అగ్ని మాపక అధికారి రేణుకయ్య, డివిజనల్ ఫైర్ అధికారి సింహచలం, సివిల్ డిఫెన్స్ ఎస్డీసీ మధుసూదన్‌రావు, ద్వారక ఏసీపీ అన్నెపు నరసిహమూర్తి, జోన్-3 కమిషనర్, ఇతర సిబ్బంది, విద్యుత్, రెవెన్యూ, పోలీసు, సమాచార శాఖ, అధికారుల, సిబ్బంది, వివిధ రక్షక దళాల అధికారుల, సిబ్బంది, పెదజాలారిపేట ఆదర్శ గ్రామం ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



భవంతుల్లో చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం..



బ్లాకౌట్‌లో భాగంగా లైట్లు ఆర్పివేత..

15వ వార్డు అభివృద్ధికి సహకరించండి

- మేయర్ 'పీలా'కు కార్పొరేటర్ శ్రీవిద్య వినతి



మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, జీవీఎంసీ లీగల్ కౌన్సెలర్ అప్పారి గిరిబాబు, నరాల సత్తిబాబు

వెంకోజీపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డులో పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావును కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య కోరారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అంజేశారు. పేదవారికి ప్రభుత్వ ఆస్పత్రిని జీవీఎంసీ నిధులతో కట్టించి, వార్డు ప్రజలకు అందుబాటులో తేవాలన్నారు. దుర్గానగర్ వద్ద ఖాళీ స్థలంలో ఫంక్షన్ హాల్ నిర్మించాలని, సింహాద్రిపురం, దుర్గానగర్ కొండవాలు ప్రాంతాలతో పాటు వెంకోజీపాలెంలో అంగన్వాడీ భవనాలు ఏర్పాటు చేయాలని, పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామసేవా సంఘం, గ్రామ సేవా సంఘంలకు సంబంధించిన శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలని మేయర్‌ను కోరారు. వీటితో పాటు ఉమానగర్, దుర్గానగర్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కొత్త లైన్లు వేయాలని, ఈ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆమోదం కూడా తెలిపారని మేయర్‌కు తెలియజేశారు. దీనిపై మేయర్ స్పందిస్తూ త్వరలోనే ఈ నిర్మాణాలకు జీవీఎంసీ నుంచి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. మేయర్‌ను కలిసిన వారిలో జీవీఎంసీ కౌన్సిల్ సభ్యులు అప్పారి గిరిబాబు, నరాల సత్తిబాబు ఉన్నారు.

11 మంది 'ఉక్కు' కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసులు

- వీరిలో నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్?
- నేడు స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం కూడలి వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, మే 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులోని 11 మంది కార్మిక సంఘ నాయకులకు యాజమాన్యం మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అంతేకాక వీరిలో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్టు తెలిసింది. ఈ నెల 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా మంగళవారం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నాయకులు ప్లాంటులోని బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సమ్మె ప్రచారం చేపట్టారు. అయితే ఇదిప్లాంట్ నిబంధనలకు విరుద్ధమని, పని ప్రదేశం వదిలి వెళ్లడాన్ని తప్పుపడుతూ కార్మిక నాయకులకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం కొద్దిమందికి మాత్రమే నోటీసులు ఇచ్చారని, మిగతా వారికి బుధవారం ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది. కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని మిగతా నాయకులు తప్పుపట్టారు. ఇందుకు నిరసనగా బుధవారం ఉక్కు పరిపాలన భవనం జంక్షన్ వద్ద ధర్నా చేయనున్నట్టు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు తెలిపారు.

పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న శ్రీకృష్ణ సేవా సంఘం అధ్యక్షుడు దువ్వి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బుద్దల కృష్ణ ప్రతినిధులు

మద్దిలపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెంలో నిర్వహిస్తున్న పోలమాంబ అమ్మవారు వార్షిక జాతర మహోత్సవాల్లో మంగళవారం దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పద్మజ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఉత్సవ నిర్వాహకులైన శ్రీకృష్ణ సేవా సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితో పాటు గ్రామాభివృద్ధికి తనవంతు సహాయం ఎప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కరమాని వెంకట్రావు, టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ సేవా సంఘం అధ్యక్షుడు దువ్వి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బుద్ధల కృష్ణ, కోశాధికారి దువ్వి వెంకటస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి చెల్లిబోయిన సునీల్‌కుమార్, కార్యదర్శులు మువ్వల మౌళి, ఎం.హరిప్రసాద్, సాంబశివరావు, ఒమ్మి అప్పారావు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను రెండు నెలల్లో పూర్తిచేయండి

- ఆరంభించని పనులను 15 రోజుల్లో ప్రారంభించాలి
- ఇంజనీరింగ్ అధికారులకు మేయర్ పీలా శ్రీనివాస్ ఆదేశం

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ వార్డులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను రెండు నెలల్లోగా పూర్తి చేయాలని మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కూటమి కార్పొరేటర్లు, ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం తన ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు.

మంజూరై, టెండర్లు కూడా పూర్తయిపోయినప్పటికీ ఇంకా ప్రారంభం కాని పనులు ఉంటే వాటిని 15 రోజుల్లోగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టంచేశారు. కార్పొరేటర్లు తమ వార్డులో వివిధ పనులు జరుగుతున్న తీరుపై అభిప్రాయాలు తెలపడంతోపాటు ఫిర్యాదు కూడా చేశారు.

ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పనులు చేయాల్సి ఉన్నట్టయితే వాటికి సంబంధించిన ప్రతిపాదనలను తనకు లేదా అధికారులకు అందజేయాలని కార్పొరేటర్లకు సూచించారు. ప్రతీ వార్డుకు రూ.రెండు కోట్లు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ నిధులతో పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇది బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఈ విషయంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు.

బౌద్ధ తత్వశాస్త్రం విద్యావేత్తలకు మార్గదర్శకం



సదస్సులో ప్రసంగిస్తున్న బౌద్ధ తత్వవేత్త ధమ్మరిక్కిత థేరో

ఎంవీపీ కాలనీ, మే 13 (ఆంధ్రజ్యోతి) : విద్యావేత్తలకు బౌద్ధ తత్వశాస్త్రం మార్గదర్శకంగా నిలుస్తుందని శ్రీలంకకు చెందిన బౌద్ధ తత్వవేత్త మొరవక ధమ్మరిక్కిత థేరో అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఎం కళాశాలలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. బుద్ధుడి కాలానుగుణ బోధనలు, సమకాలిన విద్యా, వాటి ఔన్నత్యం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఆధునిక కాలంలో మానవతా విలువలు మారుతున్నాయని, మనిషి గురించి మనిషి అర్థం చేసుకోడానికి, గ్రహించడానికి ప్రతి ఒక్కరూ మానవతా వాదంతో మెలగాలని సూచించారు. ఎదుటి వారికి మంచి చేయాలనే ఆలోచన చేయడం ద్వారా మంచి విస్తరిస్తుందన్నారు. బోధనా వృత్తికి సంబంధించిన అనేక ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. కళాశాల డీన్ డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర, ఆచార్య కృష్ణమోహన్, అంబేడ్కర్ వర్సిటీ (శ్రీకాకుళం) పూర్వ వీసీ ఆచార్య లజపతిరాయ్, శ్రీలంకకు చెందిన ఇసంకా గమగే తదితరులు ప్రసంగించారు.

ముగిసిన వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంపు



సమ్మర్ క్యాంపులో తయారు చేసిన ఆట వస్తువులతో చిన్నారులు

మద్దిలపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ పార్కులో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు మంగళవారంతో ముగిసింది. పదిహేను రోజుల పాటు నిర్వహించిన ఈ క్యాంపులో చిన్నారులకు ప్రతిరోజూ ఓ వినూత్న కార్యక్రమంతో అలరించారు. పిల్లలతో చిత్రలేఖనం, విత్తనాలతో బొమ్మలు, పాట్ పెయింటింగ్, క్రాఫ్ట్ వర్క్స్ చేయించారు. అలాగే పార్కులో ఖో-ఖో, కబడ్డీ వంటి క్రీడలు ఆడించారు. సైన్స్ ప్రాజెక్టులు చేయించారు. చివరి రోజున 40 రకాల వంటకాలతో పిల్లలతో పాటు దాతలు, నిర్వాహకులు సామూహిక భోజనాలు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ కన్వీనర్ కె.సుశీల మాట్లాడుతూ వేసవిలో పిల్లలకు ఆహ్లాదం అందించేందుకు సమ్మర్ క్యాంపు చేపట్టామన్నారు. చిన్నారులకు 15 రోజుల పాటు వివిధ రకాల ఆటలు, విద్యకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మద్దిలపాలెం కన్వీనర్ మణి, ఆసరా చారిటబుల్ సొసైటీ నిర్వాహకులు త్రినాథ్, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జోన్-4లో వీధి విక్రయదారుల సర్వే

- జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

వెంకోజీపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు స్ట్రీట్ వెండర్ సర్వే 2025 సంబంధించి జోన్-4 పరిధిలో వార్డు నెంబరు 28 నుంచి 39 వార్డుల్లో గల వీధి విక్రయ వర్తక వ్యాపారుల సర్వే నిర్వహించడం జరుగుతుందని నాలుగో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ జోన్-4 సూర్యాబాగ్ పరిధిలో ఉన్నటువంటి జీవీఎంసీ సచివాలయ సిబ్బందితో వీధి విక్రయ వర్తక వ్యాపారులకు సర్వే నిర్వహిస్తున్నామని, కాబట్టి సంబంధిత వర్తకులు అందరూ ఈ సర్వేకు సహకరించాలన్నారు. స్ట్రీట్ వెండర్స్ సర్వేకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత 28 నుంచి 39 వార్డుల పరిధిలోని అన్ని సచివాలయాల్లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. వెండర్ తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, మొబైల్ నెంబర్, బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్ కాపీ, మ్యాక్సిసైజు ఫ్యామిలీ ఫోటోలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

సినిమా గైడ్

- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 13, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 24, పచ్చిమిర్చి 22, కాకరకాయలు 40, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 24, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)48, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 90, బద్ధచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 90, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడ దుంపలు 38, కంద 84, దేముడు చిక్కుడు 34, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

టీడీపీ కార్యకర్తలు దాడి చేశారంటూ సీపీకి బీవీ రామ్ ఫిర్యాదు

గాజువాక, మే 13 (ఆంధ్రజ్యోతి): గాజువాకలో సోమవారం తనపై కొంతమంది తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలు దాడి చేశారని, వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ మంగళవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి ఫిర్యాదు చేశారు. గాజువాకలోని ఓ హోటల్‌లో తాను ఉండగా టీడీపీకి చెందిన కొంతమంది వ్యక్తులు వచ్చి తనపై దాడి చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. అకారణంగా తనపై దాడి చేశారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వివాహిత అదృశ్యం

భీమునిపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కృష్ణాకాలనీలో వివాహిత బంగారు కవిత (28) అదృశ్యమైంది. ఈనెల పదవ తేదీన రేషన్ సరకులు తీసుకురావడానికి వెళుతున్నానని తల్లి వరలక్ష్మికి తెలిపి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లి పొడుగు వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తెకు సుమారు తొమ్మిదేళ్ల క్రితం బంగారు పైడిరాజుతో వివాహం చేశామన్నారు. ఈ దంపతులకు ఇరువురు పిల్లలు ఉన్నారని తెలిపారు. అయితే, గత కొంత కాలంగా కవిత ప్రవర్తన సరగా లేకపోవడంతో పలుమార్లు భర్త పైడిరాజు, తల్లి వరలక్ష్మిలు మందలించడం జరిగింది. అయినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పుట్టింటికి కుమార్తె కవితను తల్లి వరలక్ష్మి తీసుకువచ్చింది. ఈ క్రమంలో కవిత కనిపించకుండాపోయింది. మూడు రోజులుగా కుమార్తె కనిపించకపోవడంతో బంధువుల వద్ద, పరిసర స్నేహితులవద్ద వాకబు చేసినా జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

10వ వార్డులో కాలువల్లో పూడికల తొలగింపు

- మేయర్ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం



ఇందిరానగర్‌లో ప్రధాన కాలువలో పూడికలు తీయిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఆరిలోవ, మే 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులోని ప్రధాన ఆలువలో పేరుకు పోయిన పూడికలను యంత్రాల సహాయంతో పారిశుధ్య సిబ్బంది తొలగించారు. శుకవారం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ఈ వార్డులో పర్యటించి పారిశుధ్య పరిస్థితి మెరుగు పడాలంటూ ఆదేశించారు. ఈ పర్యటనలో మేయర్.. ఆదర్శనగర్ పెట్రోలు బంకు నుంచి ఇందిరా నగర్ వెళ్లే పలు ప్రధాన కాలువలో పేరుకు పోయిన పూడికలను ఆయన చూసి వెంటనే తొలగించాలంటూ ఆదేశించారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య సిబ్బంది వెంటనే స్పందించి ఎక్సకవేటర్‌తో పూడికతీతకు చర్యలు తీసుకున్నారు. ఎన్నాళ్ల నుంచో ఉన్న ఈ సమస్యను మేయర్ ఆదేశంతో పరిష్కారమైందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంల పదో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్వామినాయుడు పాల్గొన్నారు.

ఏయూలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం

- తక్షణమే హాస్టళ్లు తెరవాలని ఎయిడ్సో డిమాండ్

వెంకోజీపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయ, పోలీసు ఉద్యోగాల పోటీ పరీక్షలతో పాటు నెట్, సెట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలకు సిద్ధమవుతున్నారని, వేసవి సెలవుల్లో వీరికి వర్సిటీ హాస్టళ్లలో వసతి సౌకర్యం కల్పించాల్సిన అధికారులు కనీస సదుపాయాలు కూడా అందించడం లేదని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఎయిడ్సో) విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.అభిలాష్ ఒక ప్రకటన ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయమై ఏయూలో చదువుతున్న విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నప్పటికీ వర్సిటీ అధికారులు మాత్రం మరమ్మతులు జరుగుతున్నాయని, వేసవిలో నీటి కొరత ఉందని రకరకాల సాకులు చూపుతూ వారి దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వాస్తవానికి హాస్టళ్లలో నీటి ట్యాంకులు నిండి, నీరు వృథాగా పోతున్నా అధికారులు స్పందించకపోవడం గమనార్హమన్నారు. వర్సిటీలోని విద్యార్థులు పోటీ పరీక్షలు, ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమవుతుంటే వారిని ప్రోత్సహించాల్సింది పోయి వర్సిటీ నుంచి బయటకు పంపిస్తుండటం దురదృష్టకరమన్నారు.

ఏయూలో తక్షణమే హాస్టళ్లను తెరిచి, విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించాలని ఎయిడ్సో డిమాండ్ చేస్తుందని అభిలాష్ పేర్కొన్నారు.

వార్డు సెక్రటరీలను జూనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయాలి

- ఏడీఎంఏ కమిషనర్‌కు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ వినతి



సీడీఎంఏ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

రామ్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి) : వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీల సేవలను జూనియర్ అసిస్టెంట్‌గా పరిగణించి ప్రస్తుతం వారి పోస్టును జూనియర్ అసిస్టెంట్ పదవికి అప్‌గ్రేడ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ కోరింది. మంగళవారం అమరావతిలో జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావు ఆధ్వర్యంలో ఏపీశ్వాస్ నాయకులు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) కమిష నర్ డాక్టర్ సంపత్ కుమార్‌ను కలసి వార్డు సెక్రటరీల సమస్యలు, పదోన్నతులకు సంబంధించిన విషయాలను వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు సర్వీస్ ఉన్న వారికి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి తదుపరి పదోన్నతిని నోడల్ లేదా జోనల్ స్థాయిలో కొత్త పోస్టును సృష్టించి సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోయేషన్ జనరల్ సెక్రటరీ శేషుబాబు, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, కోశాధికారి చింతకాయల బంగారురాజు, కిరణ్మయి, పాండురంగా పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏయూలోని కన్సాలిడేటెడ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- ఏయూ వీసీ రాజశేఖర్‌కు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు వినతి

వెంకోజీపాలెం, మే 13(ఆంధ్రజ్యోతి) : ఏయూలో గత పదేళ్లుగా కన్సాలిడేటెడ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వివిధ విభాగాల నుంచి అనేక రకాల సేవలు అందిస్తూ వర్సిటీ ప్రగతిలో భాగస్వాములుగా నిలుస్తున్న తమకు ఉద్యోగంలో పురోగతి, సమస్యల పరిష్కారం కావాలని ఏయూ వీసీ జి.రాజశేఖర్‌ను ఏయూ కన్సాలిడేటెడ్ ఉద్యోగుల సంఘం మంగళవారం కలిసి విన్నవించుకుంది. తమలో చాలా మంది ఉన్నత విద్యార్హత కలిగి పదేళ్లకు పైబడి ఉద్యోగ విధులు నిర్వర్తిస్తున్న వారు కూడా ఉన్నారని, దశాబ్ద కాలం పైగా వర్సిటీ ప్రగతిలో భాగస్వాములుగా నిలుస్తున్నప్పటికీ తమకు ఎటువంటి పురోగతి లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వర్సిటీలో కన్సాలిడేటెడ్ ఉద్యోగులుగా సేవలు అందించే వారిని సర్వీసు ఆధారంగా టైం స్కేల్ ఉద్యోగాలకు ప్రమోట్ చేసే మంచి సంప్రదాయం ఏయూలో ఉందని, ప్రస్తుతం వర్సిటీలో టైమ్ స్కేల్ హోదాలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు అంతా కన్సాలిడేటెడ్, హాస్టల్ ఎన్ఎంఆర్ ఉద్యోగులుగా సేవలు అందించిన వారేనని పేర్కొన్నారు. గతంలో వర్సిటీకి సేవలు అందించిన అనేక మందికి ఉప కులపతులు వారికి ఉద్యోగ పురోగతి కల్పించి, టైమ్ స్కేల్ వర్తింపజేశారని, అయితే కొన్నేళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోవడంతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని పోషించుకునేందుకు కష్టాలు ఎదుర్కొంటున్నామని ప్రకటనలో వాపోయారు. గతంలో ఉద్యోగి జీతంలో 10 శాతం పెంపు విధానాన్ని గత 6 ఏళ్లుగా నిలిపివేయడంతో అన్ని రకాలుగా తాము నష్టపోవడం జరిగిందన్నారు. తమ సర్వీసు ఆధారంగా ఉద్యోగ పురోగతితో పాటు జీతాలు పెంపుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని వీసీకి విన్నవించారు. గత వర్సిటీ వీసీ విద్యార్హత ఆధారంగా అనేక మంది ఉద్యోగులకు ఉద్యోగ పురోగతిని కల్పించిన విధానాన్ని కొనసాగించాలని కోరారు. విద్యార్హత ఉన్న వారికి టైమ్ స్కేల్ వర్తింపజేయడంతో పాటు రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పిస్తూ అవసరమైన చోట వారి సేవలు వినియోగించుకోవాలన్నారు. వర్సిటీలో ఎక్కువ జీతాల్లో నియమితులైన వారిని పక్కన పెట్టి సర్వీసు సీనియారిటీ ఉన్నవారికి ప్రాధాన్యం కల్పించాలని, గత 8 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది మార్చిలో కన్సాలిడేటెడ్ ఉద్యోగుల జీతంలో 20 రోజులు కోత విధించిన విధానాన్ని నిలిపి వేయాలని, సర్వీసు తక్కువ ఉన్న ఉద్యోగులకు గతంలో ఏటా జీతంలో 10 శాతం పెంచే విధానాన్ని కొనసాగించాలని, వారి జీతంలో 10 శాతం మొత్తం పెంపును ఏటా మార్చి నుంచి అమలు చేయాలని సంఘం అధ్యక్షుడు సిర్ల శ్యామసుందరావు, ప్రతినిధులు పడవల సంజీవరావు, పి.రవికుమార్, శ్రీను, సుజాత కోరారు.

ఉచితంగా ప్రైవేట్ విద్య

జిల్లాలో 621 పాఠశాలల్లో ప్రవేశాలకు అవకాశం

- ఈ నెల 19 వరకు దరఖాస్తులకు గడువు
- రాష్ట్ర సిలబస్‌తో పాటు సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఐబీలలో ప్రవేశాలు

డాబాగార్డెన్స్, మే 13 (ఆంధ్రజ్యోతి): **ఒకప్పుడు ప్రైవేట్ పాఠశాలలో చేరాలంటే వేలాది రూపాయలు చెల్లిస్తేనేకాని చదువుకునేందుకు అవకాశం ఉండేది కాదు. పేద విద్యార్థులకు ప్రైవేటు విద్య అందనంత దూరంలో ఉండేది. అనంతర పరిణామాల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునేందుకు అందరికీ అవకాశం కలుగుతోంది.**



ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇచ్చేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలి. 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్ర సిలబస్‌తో పాటు సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఐబీ బోధన అందిస్తున్న జిల్లాలోని 621 ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్షిస్తున్నారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్ లేదా సమీపంలోని సచివాలయాల్లో అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంఈఓ నుంచి ప్రధానోపాధ్యాయుల వరకు వీటిపై అవగాహన కలిగించడంతో తల్లిదండ్రులు ముందుకొస్తున్నారు.

ఎవరు అర్హులు?

- ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలకు (అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు) 5 శాతం
- షెడ్యూల్డు కులాలు 10 శాతం
- షెడ్యూల్డ్ తెగలు 4 శాతం
- బీసీ, మైనారిటీ, ఓసీ, గ్రామీణ ప్రాంత కుటుంబాల వారి సంవత్సర ఆదాయం రూ.1,20,000, పట్టణ ప్రాంత కుటుంబాల ఆదాయం రూ.1,44,000 లోపు ఉన్న పిల్లలకు 6 శాతం, మొత్తం 25 శాతం కేటాయిస్తారు.

అర్హత, వయస్సు

సీబీఎస్ఇ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్‌ను అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం ఏప్రిల్ 2, 2019 నుంచి మార్చి 31, 2020 మధ్య జన్మించి 5 సంవత్సరాల వయసు నిండి ఉండాలి.

రాష్ట్ర సిలబస్‌ను అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం 2019 జూన్ 2 నుంచి 2020 మే 31 మధ్య జన్మించి 5 సంవత్సరాలు వయస్సు నిండి ఉండాలి.

దరఖాస్తు చేసే విధానం

డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్ఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ సందర్శించాలి లేదా సచివాలయం, ఇంటర్నెట్, మండల విద్యాశాఖాధికారి కార్యాలయం, మీ సేవా సెంటర్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

షెడ్యూల్ ఇలా..

- ఈ నెల 19 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- 20 నుంచి 24 వరకు మధ్య అర్హులైన విద్యార్థుల జాబితా ప్రకటన
- 29న మొదటి రౌండ్ లాటరీ నిర్వహించి విద్యార్థుల ఎంపిక
- జూన్ 8న ఎంపికైన విద్యార్థులు స్కూళ్లలో చేరాలి.
- జూన్ 11న రెండో రౌండ్ లాటరీ నిర్వహించి విద్యార్థుల ఎంపిక
- జూన్ 18న విద్యార్థులు స్కూళ్లలో చేరాల్సి ఉంటుంది.



ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు సూచనలిస్తున్న సమగ్రశిక్ష అదనపు సమన్వయకర్త జోగ చంద్రశేఖరరావు

అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి



విద్యా హక్కు చట్టం మేరకు గుర్తింపు ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాలి. దీనిని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్రంలోని 80 వేల వరకు సీట్లు అందుబాటులో ఉండగా 2024-2025లో మాత్రం 29 వేల మంది ప్రవేశాలు పొందారు. దగ్గరలో ఉండే పాఠశాల కంటే దూరంగా ఉండే పాఠశాలలో జాయిన్ కావాలన్నది ఎక్కువమంది అభిమతం. జిల్లా పరిధిలోని 621 ప్రైవేట్ పాఠశాలలు మ్యాపింగ్ అయి ఉన్నాయి. సీటు అర్హత పొందిన విద్యార్థికి ఫీజుతో పాటుగా పుస్తకాలు, యూనిఫాం అన్నీ ప్రభుత్వమే సమకూరుస్తోంది. ఉచిత విద్య ప్రవేశాలపై ప్రతీ రోజు డీఈవోల పర్యవేక్షణలో మండలాల వారీగా సమీక్షిస్తున్నాం.

- బి.విజయ్‌భాస్కర్, ఆర్జేడీ

25 శాతం సీట్లు భర్తీ అయ్యేలా చర్యలు



ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే దీనికి సంబంధించి ఆయా పాఠశాలల్లో సైతం మార్గదర్శకాలు జారీచేశాం. సచివాలయాలవారీగా దీనిపై సమీక్షిస్తున్నాం. అర్హులంతా గడువులోగా దరఖాస్తు చేసుకోవచ్చు. తద్వారా 2025-26 సంవత్సరానికి అడ్మిషన్లు పొందవచ్చు.

-జోగ చంద్రశేఖరరావు,
సమగ్రశిక్షా అదనపు సమన్వయకర్త

చదువు ఎంతో ముఖ్యం



చదువు ఎంతో ముఖ్యం. ప్రభుత్వ పాఠశాలల్లో చక్కగా లభిస్తుంది. అయితే ప్రైవేట్ పాఠశాలల్లో సీబీఎస్ఈ, ఇతరత్రా సిలబస్‌లో చదుకునేందుకు పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లు కేటాయిస్తున్నాం. తద్వారా విద్యార్థులు చదువులో మరింతగా రాణించేందుకు అవకాశం కలుగుతుంది. తల్లిదండ్రులు, విద్యార్థులు మంచి అవకాశాన్ని ఉపయోగించుకుని ఉన్నత పౌరులుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

-ఎన్.ప్రేమ్‌కుమార్,
జిల్లా విద్యాశాఖాధికారి

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 89 శాతం హాజరు

మద్దిలపాలెం, మే13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షకు మంగళవారం ప్రథమ సంవత్సరానికి 97 శాతం, ద్వితీయ సంవత్సరానికి 89 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సుల నుంచి 16,133 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 498 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ కోర్సులకు 311 మందికి పరీక్షలు రాయగా, 27 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో జనరల్ కోర్సుల విద్యార్థులు 390 మంది పరీక్షలు రాయగా, 50 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ కోర్సులకు 99 మంది పరీక్షలు రాయగా, 8 మంది గైర్హాజరయ్యారు.

17, 18 తేదీల్లో గైనకాలజిస్టుల సదస్సు

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో గైనకాలజీ వైద్యశాస్త్రంలో అగ్రగామిగా కొనసాగుతున్న ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్ట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఫాగ్సి) ఆధ్వర్యంలో వేవ్స్-2025 పేరుతో ప్రెసిడెన్షియల్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్నారు. అబ్‌స్ట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ విశాఖపట్నం ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ రాడిసన్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో ఈ సదస్సును నిర్వహించనున్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రారంభించే ఈ సదస్సుకు దేశంలోని ప్రముఖ గైనకాలజిస్టులు, మహిళా ఆరోగ్య నిపుణులు, వైద్య విద్యార్థులు, పరిశోధకులు హాజరు కానున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆధునిక ల్యాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, గర్భధారణ పద్ధతులు, ప్రసూతి సమయంలో నిర్వహించే అత్యవసర శస్త్ర చికిత్సలతో పాటు వివిధ అంశాలపై సెషన్లు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు ఆర్గనైజింగ్ చైర్మన్లుగా డాక్టర్ కె.సుబ్బరాజు, డాక్టర్ టి.రాధ వ్యవహరించనున్నారు.

బంగారు పతకాల కోసం విరాళం



వీసీ రాజశేఖర్‌కు చెక్కు అందజేస్తున్న రాఘవేంద్రరావు

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం అప్లైడ్ మేథమెటిక్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రాఘవేంద్రరావు పేరిట బం గారు పతకాన్ని అందించాలని కోరుతూ ఆస్ట్రేలియాకు చెం దిన ఏయూ పూర్వ విద్యార్థి రాఘవేంద్రరావు కుంబారి మూడు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్‌ను కలిసి అందించారు. అలాగే ప్యూర్ మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి ప్రొఫెసర్ నాగ రాజారావు పేరుతో బంగారు పతకాన్ని అందించాలని కోరుతూ మరో రూ.మూడు లక్షల చెక్కును వీసీకి ఇచ్చారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ బంగారు పతకాలకు అవసరమైన నిధులను అందించిన రాఘవేంద్రరావును వీసీ అభినందించారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు, అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఈశ్వరకుమార్, అట్టారి నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఒలుపు చందనం విక్రయాలకు శ్రీకారం



విక్రయాలు ప్రారంభిస్తున్న ఏఈవో



భక్తుల క్యూ

సింహాచలం, మే 13 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఒలుపు చందనం (నిర్మాల్య ప్రసాదం) విక్రయాలకు దేవాలయ సహాయ కార్యనిర్వాహణాధికారి నక్కా ఆనందకుమార్ మంగళవారం లాంఛనంగా శ్రీకారం చుట్టారు. చందనోత్సవం జరిగి పన్నెండు రోజులు తరువాత ఎట్టకేలకు భక్తుల డిమాండ్‌తో చందన ప్యాకెట్ల అమ్మకాలు ప్రారంభించారు. ముందుగా ప్రకటించిన ప్రకారం ఉదయం 7.40 గంటలకు ఉచిత, రూ.100ల శ్రీఘ్రదర్శనం, రూ.300ల అతి శ్రీఘ్రదర్శనం క్యూలలో కోరిన భక్తులకు చందన ప్యాకెట్ల టోకెన్లను ప్యాకెటు (10 గ్రాములు) ఒకటి రూ.10లకు జారీ చేశారు. ఆ టోకెన్లు తీసుకున్న భక్తులు స్వామి వారి ప్రసాదాల విక్రయాల కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ నుంచి చందన ప్యాకెట్లు పొందారు. సుమారు మూడు గంటల పాటు భక్తులకు క్యూలో చందనం టోకెన్ల విక్రయాలు జరిపడంతో పలువురు సంతృప్తి వ్యక్తం చేశారు.

గతంలో ప్రత్యేక కౌంటర్‌లో టోకెన్ల విక్రయాలు జరపడం, దానికి పక్కనే చందనం ప్యాకెట్లు ఇవ్వటం జరిగేది. తాజాగా తీసుకున్న నిర్ణయంతో చందనం టోకెన్లు విక్రయాలు జరిగేది ఎక్కడో తెలియక కొందరు భక్తులు ఇబ్బంది పడి దేవస్థానం పీఆర్వో ఆఫీసుకు చేరుకుని చందనం ప్యాకెట్ల విక్రయాల కోసం ఆరా తీశారు. దీంతో అక్కడి సిబ్బందికి అది కాస్తా శిరోభారంగా మారింది.

ఆద్యంతం నవ్వులు పూయించే చిత్రం 'సింగిల్'

చిత్ర హీరో శ్రీవిష్ణు

సిరిపురం, మే 13 (ఆంధ్రజ్యోతి) : 'సింగిల్' సినిమాను చూసి పగలబడి నవ్వుతున్నామని ప్రేక్షకులు చెప్పడం ఎంతో ఆనందం కలిగిస్తోందని చిత్ర హీరో శ్రీవిష్ణు అన్నారు. మంగళవారం హోటల్ మేఘలయాలో చిత్ర యూనిట్ విజయోత్సవ పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ చిత్రానికి ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కుటుంబ మంతా చుడదగ్గ చిత్రమన్నారు. కథాంశం సింపుల్‌గా ఉన్నా మంచి స్క్రీన్‌ప్లే, అద్భుతమైన డైలాగ్స్ ద్వారా చిత్రం థియేటర్‌లో నవ్వులు పూయిస్తోందన్నారు.

హాస్యనటుడు వెన్నెల కిషోర్ మాట్లాడుతూ ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలో కనిపించిన శ్రీవిష్ణు తన నటనతో సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడన్నారు. దర్శకుడు కార్తీక్‌రాజు చిత్రంలోని క్యారెక్టర్స్‌ను బాగా ఉపయోగించుకుని మంచి అవుట్‌పుట్‌ను బయటకు తీయగలిగారన్నారు. చిత్ర హీరోయిన్లు ఇవానా, కేతికశర్మ మాట్లాడుతూ విశాఖ అంటే ఎంతో అభిమానమన్నారు. మంచి చిత్రంలో భాగస్వామ్యమైనందుకు ఆనందంగా ఉందన్నారు. దర్శకుడు కార్తీకరాజు మాట్లాడుతూ ఏదైతే నమ్మి సినిమాను తీశామో.. నేడు ప్రేక్షకులు ఆదరించడం ద్వారా మా నమ్మకం వమ్ము కాలేదని రుజువైందన్నారు. మంచి చిత్రానికి ప్రేక్షకులు ఎప్పుడూ విజయాన్ని అందిస్తారని మరోసారి రుజువు చేశారన్నారు. సమావేశంలో యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హీరో శ్రీవిష్ణు

విద్యార్థుల ప్రగతికి బుద్ధుడి బోధనలు దోహదం

- స్కాట్లాండ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మోరవాక



ప్రొఫెసర్ డాక్టర్ మోరవాకతో ఐఐఏఎం బృందం

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆధునిక విద్యలో బుద్ధుడు ప్రబోధించిన అనేక అంశాలు విద్యార్థుల ప్రగతికి, ఉన్నత స్థానాలను అధిరోహించేం దుకు దోహదపడతాయని శ్రీలంకలోని శ్రీజయేవర్ధనే పూర యూనివర్సిటీ, స్కాట్లాండ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మోరవాక ధమ్మరక్కిత అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఏఎం)లో మంగళవారం 'గురువుగా బుద్ధుడు-బుద్ధిస్ట్ టీచింగ్ నుంచి నూతన విద్యా విధానాలకు పాఠాలు' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బుద్ధుడు ఇచ్చిన సందేశాల్లో అనేక అంశాలు విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో ఐఐఏఎం డీన్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, మాజీ వీసీ ప్రొఫెసర్ లజపతిరాయ్, టీఐకేఎం ఎండీ అండ్ కో-ఫౌండర్ ఇసాంకా పిగామాజేతోపాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీసీలో ఉద్యోగాలకు ఎంపిక

కంచరపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల్లో డిప్లొమా ఆఖరి సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన భద్రాచలం ఐటీసీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. కళాశాల్లో చదువుతున్న కెమికల్ బ్రాంచి నుంచి విద్యార్థులు నరవ సూర్యచంద్ర, పి.సంధ్య, ఎన్.వాసవి. దుర్గా నరసింహ, ఎం.వెంకటేష్, ప్లాస్టిక్స్,పాలిమర్స్ విభాగం నుంచి ఎన్.ఉషస్విని ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సాంకేతికశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ,కళాశాల ప్రిన్సిపాల్ వీరిని అభినందించారు. రమణ మాట్లాడుతూ భద్రాచలం ఐటీసీ సంస్థ ఇంతవరకు కెమికల్ విద్యార్థులను మాత్రమే ఉద్యోగాలకు ఎంపిక చేసేదని, తొలిసారిగా ప్లాస్టిక్స్,పాలిమర్స్ బ్రాంచి నుంచి విద్యార్థిలను ఎంపిక చేశారన్నారు.

నార్కోటిక్ డ్రగ్స్ కేసులో నిందితుడి అరెస్టు

మహారాణిపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): నార్కోటిక్ డ్రగ్స్ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. 2018లో ఎన్‌డీపీఎస్‌కు సంబంధించిన కేసులో నిందితుడైన బండారు అజేయ్ (28)ను ఎన్‌బీడబ్ల్యూ టీం హైదరాబాద్‌లో పట్టుకొని టూటౌన్ పోలీసులకు అప్పగించిందన్నారు. అతడిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు పి.వెంకట రమణారావు (ఫైల్)

గాజువాక, మే 13 (ఆంధ్రజ్యోతి): గాజువాక పోలీస్ స్టేషన్ జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చినగంట్యాడ ప్రాంతానికి చెందిన పి.వెంకట రమణారావు (74) ద్విచక్ర వాహనంపై వందడుగుల రోడ్డులో జాతీయ రహదారి వైపు వస్తున్నారు. అదే సమయంలో శ్రీనగర్ నుంచి పాత గాజువాక వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న బి.రాజేశ్ అనే యువకుడు బలంగా వెంకట రమణారావు వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలవ్వడంతో స్థానికులు గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. వెంకట రమణారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన రాజేశ్‌ను వాహనంతో పాటు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రైల్వే స్టేషన్‌లో 32 కిలోల గంజాయి పట్టివేత



నిందితునితో పోలీసులు

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ1,60,000 విలువ చేసే 32 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు ధనుంజయ నాయుడు, రామకృష్ణ తన సిబ్బందితో మంగళవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధీరజ్ శర్మ అనే నిందితుడు గంజాయిని ఢిల్లీకి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

హత్య కేసు నిందితుడు ఎనిమిదేళ్లకు పట్టివేత



నిందితుడు కుమ్మరి భాస్కర్

గాజువాక, మే 13 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళను హత్య చేసి ఎనిమిదేళ్లుగా పరారీలో ఉన్న నిందితుడిని ఎట్టకేలకు గాజువాక పోలీసులు మంగళవారం పట్టుకుని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ ప్రాంతానికి చెందిన కుమ్మరి భాస్కర్ (35) గాజువాక సమీపంలోని గణపతినగర్‌లో నివాసం ఉండేవాడు. 2017లో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెను హత్య చేశాక పరారయ్యాడు. ఈ క్రమంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు పోలీసులు విస్తృతంగా గాలించి నిందితుడు కల్వకుర్తిలో పట్టుకుని గాజువాక తీసుకువచ్చారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

ఎండాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ మోసాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న కాకినాడకు చెందిన చీకట్ల వెంకటమణిచందు అలియాస్ చందూని కాకినాడలో అరెస్టు చేశారు. చందు దగ్గర నుంచి నాలుగు స్మార్ట్ ఫోన్లు, ఒక కీపాడ్ ఫోన్‌ను సైబర్ క్రైం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పదో తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో 'నారాయణ' విజయకేతనం



ఆదిత్‌కుమార్
495/ 500

సిరిపురం, మే 13 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్టు నారాయణ విద్యా సంస్థల ఏజీఎం రాజ్‌కుమార్ తెలిపారు. విశాఖ పరిధిలోని ఉన్నటువంటి నారాయణ పాఠశాలల విద్యార్థులు 500/495 మార్కులు సాధించి విశాఖ పరిధిలో మొదటి స్థానం కైవసం చేసుకున్నారన్నారు. ఆదిత్‌కుమార్ అత్యధికంగా 500/495 మార్కులు సాధించి మొదటి స్థానం దక్కించుకున్నారు. సృజత్ శర్మ 500/498, అన్వేష 500/487, ప్రసన్న కుమార్ 500/486 మార్కులు సాధించారు. మొత్తం 697 మంది విద్యార్థులకు 400 మంది విద్యార్థులు 420కు పైగా మార్కులను సాధించి 99 శాతం ఉత్తీర్ణులైనట్టు రాజ్‌కుమార్ తెలిపారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య, కృషి పట్టుదల కారణంగా తమ విద్యార్థులు ఇంతటి ఘన విజయాన్ని సాధించగలిగామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు రామ్ నరేశ్, శివప్రతాప్, ప్రిన్సిపాళు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ +2 ఫలితాల్లో రాణించిన శ్రీచైతన్య విద్యార్థులు



నిఖిత



హర్షిత



మైథిలి

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ +2 ఫలితా ల్లో నగరానికి చెందిన శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో మంచి మార్కులను సాధించారు. 500 మార్కు లకు గాను పి.నిఖిత 481, ఎస్.హర్షిత 481, జి.మైథిలి 480, పి. తారాచంద్ర 479, సీహెచ్ శాలిని 479, ఎల్.లక్ష్మీ అలేఖ్య 479 మార్కులను సాధించారు. అలాగే 480కు పైగా ముగ్గురు, 470కు పైగా 26 మంది, 450కు పైగా 87 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. 643 మందికి డిస్టింక్షన్ వచ్చింది. ఉత్తమమైన మార్కులు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి, తల్లిదండ్రులకు శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కేవీ రమణ, డీన్స్ ఎన్.రఘుకుమార్, కె.బంగారుబాబు అభినందనలు తెలిపారు.

పదో తరగతిలో శ్రీచైతన్య సంచలన రికార్డులు



పదో తరగతిలో 498 మార్కులు సాధించిన శ్రేయస్ కుమార్‌ను అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాల సిబ్బంది

మహారాణిపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి మోగించింది. విశాఖకు చెందిన శ్రేయస్ కుమార్ 500 మార్కులకు 498 సాధించి చరిత్ర తిరగరాసినట్లు శ్రీ చైతన్య ఏజీఎం ఎంవీ సురేష్ తెలిపారు. 18 మందికి 490 (98 శాతం), 31 మందికి 485 (97శాతం), 47 మంది 480 (96శాతం) మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. వందశాతం పర్సంటేజ్ సాధించి సంచలనం సృష్టించారని అన్నారు. 179 మంది 450 (90శాతం)కి పైగా మార్కులు సాధించారని, వీరి ప్రతిభ గర్వకారణమని ప్రశంసిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.